నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 22-2-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:160 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

కోటి తీర్థాలు
ముక్కోటి కుసుమాలు
సీతా పతికి.

కుడ్యచిత్రాలు
ప్రాంత కళాకృతులు
చిత్ర చరిత్ర.

చింత పులుసు
చెంచుల జీవసుధా
తీరని వ్యధ

సూక్ష్మ రుణాలు
శుభ పరిణామాలు
పేదకు ఊతం.

కవి వేమన
ఆటవెలదికి రాజు
సంఘ ప్రవక్త

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

సారలమ్మ రాకతోనె
మొదలయ్యే జాతర !
మొక్కులు తీర్చగ భక్తులు
దుర్మార్గం పాతర !.

లక్షల జనంతో నేడు
ఉక్కిబిక్కిరవుతుందోయ్
వన జాతర మేదారం
కిక్కిరిసీపోతుందోయ్ !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

మేడారం జాతర.. జనసంద్రమైన జంపన్నవాగు..

వరంగల్, ఫిబ్రవరి 21:మేడారం జాతరకు వచ్చిన భక్తులతో బుధవారం జంపన్నవాగు జన సంద్రమైంది. మేడారం వన దేవతల దర్శనంకు వచ్చిన భక్తులు మొదట జంపన్నవాగు వద్దకు చేరుకుని అక్కడ పుణ్య స్నానాలు ఆచరించి అనంతరం తల్లుల గద్దెలను దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకుంటారు.

బుధవారం మేడారం జాతరకు వచ్చిన భక్తులతో జంపన్నవాగుకు ఇరువైపులా కిక్కిరిసిపోయింది. జంపన్న వాగులో పుష్కలంగా నీరు ఉండడంతో కొంతమంది భక్తులు జంపన్నవాగులో, మరి కొంతమంది భక్తులు జంపన్న వాగు వద్ద ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ వద్ద భక్తులు స్నానాలు ఆచరించారు. ఇసుక వేస్తే రాలనంత భక్త జనంతో జంపన్నవాగు ప్రాంతం సందడిగా మారింది.

భక్తులతో నిండిపోయిన మేడారం పరిసర ప్రాంతాలు

నేటి నుంచి మేడారం మహా జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులు ఇప్పటికే భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఇంకా పెద్ద ఎత్తున భక్తులు వస్తూనే ఉన్నారు. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా మేడారం తరలి వస్తున్నారు.

సమ్మక్క తనయుడు కన్నెపల్లిలో కొలువైన జంపన్న మంగళవారం రాత్రి 7.09 గంటలకు బయలుదేరి 8 గంటలకు వాగు ఒడ్డున ఉన్న గద్దెపైకి చేరుకున్నాడు. పూజారి పోలెబోయిన సత్యం కన్నెపల్లిలోని ఇంటిలో పూజా సామగ్రిని శుద్ధిచేసిన అనంతరం జంపన్న గద్దెకు అలుకుపూతలు నిర్వహించి ఆయన ప్రతిరూపమైన డాలు, కర్రకు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. గ్రామ మహిళలు ఊరు పొడవునా నీళ్లారబోస్తూ జంపన్నను సాగనంపారు.

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సారలమ్మను కన్నెపల్లి నుంచి మేడారం గద్దెలపైకి తెచ్చే ప్రక్రియ ఇవాళ మొదలైంది. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం సాయంత్రం ఆరు గంటలకు పూజలు నిర్వహిస్తారు. ఆదివాసీ పూజారులు, మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు, ఏఎస్పీలు కలిసి కన్నెపల్లి నుంచి సారలమ్మను మేడారంలోని గద్దెల వద్దకు తీసుకొస్తారు.

జాతరలో పారిశుధ్యం మెరుగుకు అత్యంత ప్రాధాన్యత

మేడారం బ్యూరో: ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక చొరవతో జిల్లా పంచాయతీ విభాగం ద్వారా జాతరలో పారిశుధ్యం మెరుగుకు అత్యంత ప్రాధాన్యత కల్పించారు. ఆలయ ప్రాంగణంతో పాటు భక్తులు దర్శనానికి వెళ్లే సెక్టార్లు, 4 వేలమంది పారిశుద్ధ్య కార్మికులను నియమించి పరిశుభ్రంగా ఉంచుతూ మేడారం పరిసరాలు స్వచ్ఛ పర్యవేక్షణ స్థలాలుగా తీర్చిదిద్దుతున్నారు. దీనికి భక్తులే ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నారు.

కాగా, మంగళవారం మేడారం శ్రీ సమ్మక్క- సారాలమ్మ మహజాతర అమ్మవార్లను దర్శించుకునే ఆలయ ప్రాంగణం ముందు భాగంలో పారిశుధ్యం కార్మికులు పరిశుభ్రం చేయడం ఛాయాచిత్రం ద్వారాబంధించడం జరిగింది. ప్రజాప్రతినిధులు, అతిథులు ఎక్కువగా సందర్శించే ప్రాంతం కావడం అధికారులు నిరంతరం పర్యవేక్షించి పారిశుధ్యం పై చర్యలు చేపట్టడం హర్షించదగ్గ విషయం.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టచ్ చేసి చూడు.. తడఖా చూపుతాం- పొన్నం ప్రభాకర్

కరీంనగర్, ఫిబ్రవరి 21:రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ దోస్తీ అందరికి తెలుసని అన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. మహారాష్ట్రలో కూల్చిన విధంగా.. తెలంగాణలో ప్రభుత్వాన్ని కూల్చడం కుదరదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. కరీంనగర్ ఆదర్శనగర్ లో జరిగిన అగ్నిప్రమాదం బాధితులను ఆయన నేడు పరామర్శించారు.. వారికి ధైర్యం చెప్పారు.. ప్రభుత్వ పరంగా సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పొన్నం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డిని నియమించారని, అయితే, ఆ నియామకాన్ని అందరూ 'కిషన్ రెడ్డి.. నామినేటెడ్ బై కేసీఆర్' అన్నారంటూ ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే కాంగ్రెస్‌ను టచ్ చేసి చూడాలని సవాల్ విసిరారు. పార్లమెంట్ ఎన్నికల ముందు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఏవో కుట్రలు చేయబోతున్నారని, అవన్నీ తమకు తెలుసని పేర్కొన్నారు. ఇన్నాళ్లు బీజేపీని వ్యతిరేకించిన ప్రతి ఒక్కరిని జైలుకు పంపారని, అదే తెలంగాణ సంపదను ప్రాజెక్టుల పేరిట దుర్వినియోగం చేసిన కేసీఆర్ కుటుంబాన్ని బీజేపీ పెద్దలు ఎందుకు జైలుకు పంపడం లేదంటూ ప్రశ్నించారు.

ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్రిక్తత.. రైతులపై మరోమారు టియర్ గ్యాస్ ప్రయోగించిన పోలీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 21: పంటలకు కనీస మద్దతు ధర అంశంలో రైతులు కేంద్రంపై మరోమారు దండయాత్ర ప్రారంభించారు ఛలో ఢిల్లీ పేరిట తమ నిరసనను నేడు తిరిగి ప్రారంభించారు. ఇందులో భాగంగా శంభు సరిహద్దు (రాష్ట్రజీఎఎస్టీబీ ఎనీతీటవతీ) వద్దకు భారీగా చేరుకొని రాజధానిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్న రైతులను పోలీసులు అడ్డుకున్నారు. రైతులు రాజధానిలోకి ప్రవేశించకుండా ముళ్ల కంచెలు, బారికేడ్లను ఏర్పాటు చేశారు.

అయితే ట్రాక్టర్ల సాయంతో బారికేడ్లను తొలగించి ఢిల్లీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన రైతులపై పోలీసులు మరోమారు టియర్ గ్యాస్ (ఎవజీతీ ఉజీబ) ప్రయోగించారు. దీంతో సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, రైతులపై హర్యానా పోలీసులు ఇప్పటికే ఓసారి టియర్ గ్యాస్ ప్రయోగించిన విషయం తెలిసిందే.

మరోవైపు పోలీసుల తీరుపై రైతులు మండిపడుతున్నారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతామని చెప్పినా పోలీసులు వినిపించుకోలేదని వాపోతున్నారు. తమపై టియర్ గ్యాస్ ప్రయోగించారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శాంతియుత ప్రదర్శనకూ అనుమతి వ్వకపోవడంపై వారు మండిపడుతున్నారు.

మా ఫోకస్ అంతా అభివృద్ధిపైనే- సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 21:తెలంగాణలో ఎన్నికలు అయిపోయాయి.. ఇప్పుడెవరూ రాజకీయాలు చేయడం లేదు..తమ ఫోకస్ అంతా అభివృద్ధిపైనే అన్నారు రేవంత్. బుధవారం హైదరాబాద్ లో సీఐఐ తెలంగాణ ఆధ్వర్యంలో విద్యా, నైపుణ్యాభివృద్ధి అంశంపై జరిగిన సమావేశానికి చీఫ్ గెస్టుగా రేవంత్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రూ.2000 కోట్లతో 64ఐటీఐలను స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లుగా డెవలప్ చేయబోతున్నట్లు చెప్పారు. స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటు కోసం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. స్కిల్ డెవలప్ మెంట్ లో జాయిన్ అయిన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్స్ ఇవ్వబోతున్నామన్నారు.

ఈ ప్రభుత్వం అందరిదీ..మీరు కోరుకుంటేనే ఇక్కడికి వచ్చామని.. రాష్ట్రాభివృద్ధికి అందరి సహకారం అవసరమన్నారు. ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడాలన్నదే మా విధానమని.. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు సీఎం.

రాజకీయాలు ఎలా ఉన్నా వైఎస్, చంద్రబాబు, కేసీఆర్ హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగించారని చెప్పారు రేవంత్. అభివృద్ధి విషయంలో మా ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు లేవన్నారు. నగర అభివృద్ధి కోసం గత పాలకులు తీసుకున్న మంచి నిర్ణయాలను కొనసాగిస్తామని చెప్పారు. గతంలో అవుటర్ రింగ్ రోడ్ అవసరం లేదని కొందరు అన్నారని ఇప్పుడది హైదరాబాద్ కు లైఫ్ లైన్ గా మారిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

ఈనెల 24న తిరుపతి నగర ఆవిర్భావ వేడుకలు : టీటీడీ చైర్మన్

తిరుపతి, ఫిబ్రవరి 21: తిరుపతి ఆవిర్భావ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు ఆదేశాలు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ 1130వ సంవత్సరం ఫిబ్రవరి 24న తిరుపతి నగరం ఆవిర్భవించిందని తెలిపారు.

భగవద్ రామానుజాచార్యులు తిరుపతిలో ఆ రోజున గోవిందరాజస్వామి వారిని ప్రతిష్ఠించి, కైంకర్య నిర్వహణ కార్యక్రమాలు రూపొందించి, నాలుగు మాడవీధుల నిర్మాణం ప్రారంభించారని వివరించారు. తొలుత ' గోవిందరాజ పట్టణం'గా, తరువాత 'రామానుజపురం' గా పిలిచే వారని, 13వ శతాబ్దం ప్రారంభం నుంచి తిరుపతిగా పిలుస్తున్నారని చెప్పారు. తిరుపతి ఆవిర్భావ వేడుకల్లో భాగంగా గోవిందరాజ స్వామివారి ఆలయం నుంచి ఉదయం 8 గంటలకు ఊరేగింపు ప్రారంభమవుతుందని తెలిపారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్తు, దాససాహిత్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల సహకారంతో విభిన్న కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, దేవతా మూర్తులతోపాటు రామానుజాచార్యుల వేషధారణ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం అధికారి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వారంలోనే రీజినల్ రింగ్ రోడ్డు పనులకు టెండర్లు-మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 21:వారంలోనే రీజినల్ రింగ్ రోడ్డు పనులకు టెండర్లు పిలుస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ? కేంద్రం నుంచి నిధులను తీసుకోవడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. గత ప్రభుత్వం చేతగానితనంతో రీజినల్ రింగ్ రోడ్డు పని ఆగిపోయిందన్నారు.

ఢిల్లీ పర్యటనలో చాలా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించుకున్నామన్నారు. రూ.700 కోట్లతో నల్గొండ బైపాస్ రోడ్ ను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మంజూరు చేశారని చెప్పారు. ఇందుకు ఆయనకు దన్యావాదాలు తెలిపారు. వారంలో భూమి సేకరించి టెండర్లు పిలుస్తామని చెప్పారని వెంకట్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌పై కిషన్‌రెడ్డి పిచ్చి మాటలు మానుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్‌ను టచ్ చేస్తే నామరూపాలు లేకుండా చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వార్నింగ్ ఇచ్చారు.

సమ్మక్క, సారక్కల నామస్మరణతో.. తెలంగాణ ఆధ్యాత్మిక వాతావరణం.. మంత్రి కొండా సురేఖ

వరంగల్, ఫిబ్రవరి 21:మేడారం జాతరను పురస్కరించుకొని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మేడారం జాతర ఆదివాసీ ఆత్మగౌరవానికి, తెలంగాణ సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతిక అని మంత్రి పేర్కొన్నారు. సమ్మక్క, సారక్కల నామస్మరణతో నేడు యావత్ తెలంగాణలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందని తెలిపారు. నియంతృత్వానికి వ్యతిరేకంగా సమ్మక్క, సారక్కలు వీరోచిత పోరాటం చేసి, వీరమరణం పొందినా తెలంగాణ ప్రజల గుండెల్లో సదా జీవించే ఉన్నారన్నారు.

ఆత్మగౌరవమే ఆభరణంగా బతుకుతున్న తెలంగాణ బిడ్డలకు సమ్మక్క, సారక్కలే స్ఫూర్తి ప్రదాతలు అని మంత్రి పేర్కొన్నారు. సమ్మక్క, సారక్కల స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ గొప్ప సంకల్ప బలంతో పోరాటం చేసి నియంతృత్వ పాలనకు చరమగీతం పాడిందన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం కొలువైన వెంటనే మేడారం జాతరను నిర్వహించుకునే అవకాశం కలగటం అదృష్టంగా భావిస్తున్నామని మంత్రి అన్నారు. మేడారం మహా జాతర ఆసియా ఖండంలోనే అతి పెద్ద జాతరగా నిలవడం తెలంగాణ ఖ్యాతిని, జాతర ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటుతున్నదని అన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం మేడారం జాతరను అత్యంత వైభవోపేతంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సకల ఏర్పాట్లను చేసిందని మంత్రి పేర్కొన్నారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు 24 గంటలు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో మేడారం జాతరకు జాతీయ హోదా తేలేకపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ హోదా తెచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన అన్ని సౌకర్యాలను వినియోగించుకుంటూ, గుండెల నిండా భక్తితో అమ్మవార్లను దర్శించుకొని, క్షేమంగా ఇళ్ళకు చేరుకోవాలని ప్రజలకు మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు

తల్లిదండ్రులపై కొడుకు దాడి.. తండ్రి మృతి, తల్లి పరిస్థితి విషమం

అమరావతి, ఫిబ్రవరి 21:తల్లిదండ్రులపై కొడుకు దాడి చేయడంతో.. దాడిలో తండ్రి మృతిచెందిన విషాద ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు పరిధిలోని పిడుగురాళ్లలో చోటుచేసుకుంది. ఈ దాడిలో తండ్రి అక్కడికక్కడే మృతిచెందగా, తల్లి పరిస్థితి విషమంగా ఉంది.

తల్లిని సమీపంలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కొడుకు ఆస్తి కోసమే తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డాడని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆస్తి విషయంలో తల్లిదండ్రులు, కొడుకు మధ్య మాటామాటా పెరగడంతో కొడుకు తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డాడని స్థానికులు అంటున్నారు.

ఆకస్మిక తనిఖీ -జిల్లా కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 21:(నేటినిజం ప్రతినిధి): కౌడిపల్లి మండల కేంద్రములోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , కమ్యూనిటి ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ పలు రికార్డ్ లు, సిబ్బంది హాజరు నమోదులను పరిశీలనఅందుబాటులో లేని డాక్టర్,సిబ్బంది ,ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ రాజర్షి షా సమయ పాలన పాటించని వారి పై చర్యలకు ఆదేశంరోగులతో సంభాషణ ,సేవల గురించి ఆరా అందుబాటులో లేని డాక్టర్,సిబ్బందిని రాతపూర్వక వివరణ ఇవ్వలని సంబంధిత శాఖకు ఆదేశాలు స్థానిక కౌడిపల్లి మండల కేంద్రం లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,కమ్యూనిటి ఆరోగ్య కేంద్రం ను బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూఆరోగ్య కేంద్రాలలో అన్ని వసతులు ఉన్న సిబ్బంది అందుబాటు లో లేరన్నరు . కౌడిపల్లి ఆరోగ్య కేంద్రం డెలివరీల లో జిల్లాలో మంచి స్థానం లో ఉందన్నారు. స్టాఫ్ నర్స్ లు, సూపర్వైజర్ ఆఫీసర్ లు అందుబాటు లో లేకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది సిబ్బంది సెలవు పత్రము రాసి పెట్టారు కానీ అందులో తేదీని వేయలేదని ఇది సరైన పద్ధతి కాదన్నారు. పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నరు. ఆరోగ్య కేంద్రాల పరిసరాలు, ఆరోగ్య కేంద్రం లో ఉన్న గదులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాల రికార్డ్ లు, సిబ్బంది హాజరు నమోదు రికార్డ్ లను పరిశీలించారు. అందుబాటులో లేని డాక్టర్ , సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులతో సంభాషించారు. రోగులతో ఆరోగ్య కేంద్రాలలో ఉన్న సేవల గురించి ఆరా తీశారు. రోగులకు జరిపే పరీక్షలు,రోగులకు ఇచ్చేమందుల వివరాలను పరిశీలించారు. సిబ్బంది పని తీరు మరాలన్నరు. సమయపాలన పాటించని సిబ్బంది పై చర్యలు తప్పవన్నారు. సమయ పాలన పాటించని డాక్టర్, సిబ్బందిని రాతపూర్వక వివరణ ఇవ్వలని సంబంధిత శాఖ ను అదేశించారు.

సమ్మక్క-సారక్కలకు ప్రణమిల్లుదాం..

మేదారం జాతరపై ప్రధాని మోదీ ట్వీట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగ, తెలంగాణ కుంభమేళగా పిలిచే మేదారం సమ్మక్క సారక్క జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

'మేదారం జాతర.. గిరిజనుల అతిపెద్ద పండుగల్లో ఒకటి. ఈ జాతర భక్తి, సంప్రదాయం, సమాజ స్ఫూర్తిల గొప్ప కలయిక. మనం సమ్మక్క-సారక్కలకు ప్రణమిల్లుదాం. వారు అభివ్యక్తీకరించిన ఐక్యతా స్ఫూర్తిని, పరాక్రమాన్ని గుర్తు చేసుకుందాం.

చురక

ఇహలోకం ఇక్కట్లను
ఇష్టంగా భరించాలి
పరలోకం ఆనందం
భక్తితోని స్మరించాలి.

అంతా ఇది విధి రాతనే
ఆలోచన వికల్పం
బయటపడకుంటే నిత్య
బాధల శరతల్పం

–వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం- నేటికి అందం

ఆపదలకోర్చి-మనమును
దీపింపగ జేయగలుగు తెలుగులకథ-కా
కీపట్నము రామండై
స్థాపన మొనరించె ఘన కథానిలయంబున్

(22-2-1997 కా రా మాస్టారు గారి కథానిలయం ప్రారంభం)

–రాధశ్రీ
సెల్:9494481210

ఆహ్వానం
పుస్తక పరిచయ సభ
కొమ్మవరపు విల్సన్‌రావు కవితా సంపుటి
నాగలికూడా అయుధమే



తేది : 25 ఫిబ్రవరి 2024 ఆదివారం
ఉ॥ 9-30 గం॥ నుండి మ॥ 12.00 గం॥ల వరకు
వేదిక : మీటింగ్ హాల్, యు.టి.ఎఫ్. కార్యాలయం, శ్రీకాకుళం

ముఖ్య అతిథి : అట్టాడ అప్పల్నాయుడు, కథా రచయిత
విశిష్ట అతిథి : కలిమిశ్రీ, 'నవ మల్లెతీగ' మాసపత్రిక సంపాదకులు, విజయవాడ
పుస్తక పరిచయ ప్రసంగాలు :
డా॥ కె.జి. వేణు, కవి, రచయిత, నాటక కర్త, విశాఖపట్నం
డా॥ కె. ఉదయ్‌కిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డా॥ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటి, ఎచ్చెర్ల
ఆత్మీయ వాక్యాలు :
పాయల మురళీకృష్ణ, వి.జి.కె. మూర్తి
బాల సుధాకర మౌళి, నెట్టిమి రమణారావు
కంచరాన భుజంగరావు, చింతాడ తిరుమలరావు
బాడాన శ్యామలరావు, దాసరి రామచంద్రరావు
పూజారి దివాకర్
కవి స్పందన : కొమ్మవరపు విల్సన్ రావు, సృజనక్రాంతి దినపత్రిక సహితీ సంపాదకులు, హైదరాబాద్
సభాధ్యక్షులు : కేతవరపు శ్రీనివాసు, కన్వీనర్
నిర్వహణ : కె. షణ్ముఖరావు, ఎస్. భవానీ ప్రసాద్
కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, విద్యార్థులకు ఇదే మా ఆహ్వానము.
సాహితీ స్రవంతి
శ్రీకాకుళం జిల్లా
సెల్ : 9490098811

నేటినిజం
సాహితీ కిరణాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 22-2-2024

బుడ్డ పర్కలు

ఎంకా! తొడమీద
అగ్గి వడ్డది తియ్యర
ముందు నా కాలు
ముల్లు పీకు దొరా!



-అన్నవరం దేవేందర్
9440763479

ఘంటారవం

ఆకలి ఉంటేనే
తిను
అవసరముంటేనే
కొను.

చలించని శిఖరంలా
జీవించు
చరించే నదిలా
ఆచరించు.

ఇంటిలోని చెత్తను
వీధిలోకి విసిరేస్తారా?
దోమల వ్యాప్తికి
దోహదం చేస్తారా?

ప్రోత్సహించేవారే లేరని
ప్రయత్నం ఆపకు
ఆదిలో అవమానాలపాలైర
ఘంటసాలను మరువకు

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

దద్దరిల్లిన తెలుగు సాహిత్య మహాసభలు

మాతృ భాషాభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వీసీ ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు సూచన చేశారు.

తెలుగు అకాడమీ, అధికార భాషా సంఘం, సాహిత్య అకాడమీ, తెలుగు వర్సిటీ వంటి భాషాభివృద్ధికి తోడ్పడే సంస్థలన్నింటినీ ఏకంచేయ ల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డా రు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 15 గురువారం ప్రారంభమైన తెలుగు సాహిత్య మహా సభలో ఆయన మాట్లాడారు. ఓయూ తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15, 16, 17 మూడు రోజులు పాటు జరిగిన ఈ మహాసభను ప్రముఖ కవి ప్రొఫెసర్ ఎన్ గోపి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సదస్సు ప్రత్యేక సంచికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల ద్వారా విద్యార్థుల ఆలోచనలు విస్తృతమవడంతో పాటు పరిశోధక విద్యార్థులకు ప్రేరణలభి స్తుందని పేర్కొన్నారు. ఇటీవల కాలం జరుగుతున్న పరిశోధనల్లో సమాచ రం ఉంటుంది కానీ, జ్ఞానం కొరవడు తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ తెలుగు బోధకుడిని మించిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు, తెలుగు ప్యాంశానికి మించిన వ్యక్తిత్వ వికాస పాఠం మరొకటి ఉండదన్నారు. పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేసేలా ఉండాలని ఆకాంక్షించారు . ఉస్మానియా వర్సిటీ వీసీ ప్రొఫె సర్ డి.డి రవీందర్ మాట్లాడుతూ పీహెచ్డీలంటే ఎత్తిపోతల పథకాలయ్యాయని విచారం వ్యక్తం చేశారు . 'ఆంధ్రజ్యోధ్ర జ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విశ్వ విద్యాలయాలు సంప్రదాప్రదాయ తెలుగు మీదకన్నా ఆధునిక తెల గు మీద మరింత శ్రద్ధశ్రద్ధపెట్టాలని సూచించారు. యూనివర్సిటీలు నిఘంటువు నిర్మాణా నికి కృషి చేయాలన్నారు .

సైన్స్ కాంగ్రెస్, హిస్టరీ కాంగ్రెస్ స్థాయిలో తెలుగు లిటరరీ కా గ్రెస్ కూడా కొత్త ఆలోచనలను ప్రోత్సహి స్తూ సాహిత్య రంగానికి మార్గనిర్దేశం చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

సభలో ప్రసంగిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్.

సాహిత్య అధ్యయనం తగ్గడం వల్లే నేర ప్రవృత్తి
-ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్

ఉస్మానియా విద్యార్థి జీవితమే అంపశయ్య నవలకు ప్రేరణను, నేపథ్యాన్ని అందించిందని ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్ తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నవలను అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని వివరిం చారు. శుక్రవారం రెండోరోజు జరిగిన సమావేశంలో నవలా సమయం, విమర్శా దర్శనం తదితర అంశాలపై సాగిన కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంపశయ్య నవీన్ మాట్లాడుతూ సాహిత్య అధ్యయనం కొరవడడం వల్ల సమాజంలో నేరప్రవృత్తి పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాల మధ్య ఘర్షణే నవలా సాహిత్యంలోని వస్తు వైవిధ్యానికి ప్రేరణ అని ప్రముఖ రచయిత అల్లం రాజయ్య పేర్కొన్నారు. తెలంగాణ గత పదేళ్లలో వచ్చిన వలలు నిరాశపరిచాయని, మధ్య తరగతి జీవితాన్ని చిత్రించే నవలలు పెద్దగా రాలేదని విమర్శకుడు కాసుల ప్రతాపరెడ్డి అన్నారు. నవలా రచనలో పాత్రల పరికల్పన అం శంపై ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ ప్రసంగించారు. వర్తమాన నాటకరం గంపై కోట్ల హనుమంతరావు మాట్లా డారు. నవలా రచయితగా తన అనుభ వాలను బండి నారాయణ స్వామి వివరిం చారు. 'విమర్శనా దర్శనం' 'సాహిత్య శిల్పం' తదితర అంశాలపై సదస్సులో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు సాహితీ విమర్శ కు లు, రచయిత్రులు, కవులు పాల్గొన్నారు.

సభను ప్రారంభిస్తున్న వి.సి. ఆచార్య తంగెడ కిషన్‌రావు, డా॥ఎన్.గోపి, కె. శ్రీనివాస్, ఆచార్య లింబాద్రి, ఆచార్య కశీం తదితరులు.

సాహిత్య చరిత్రలో మైలురాయి 'లిటరరీ కాంగ్రెస్'
-ఆచార్య కొలకలూరి ఇనాక్

తెలుగు లిటరరీ కాంగ్రెస్‌కు వందేళ్ల ఉస్మానియా వర్సిటీ తెలుగు శాఖ వేదిక కావడం ఆనందంగా ఉందని సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ కాశీం హర్షం వ్యక్తం చేశారు. తెలుగు సాహిత్య మహాసభ ముగింపు సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ, సాహిత్య సదస్సు చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపో తుందని కొనియాడారు. నిర్వాహకుడు కాశీంను అసాధారణ ప్రొఫెసర్‌గా అభివర్ణిం చారు. గొప్ప సాహిత్యానికి అణకువేకానీ, అహంకారం ఉ ండన్నారు. అంతకు ముందుగా 'పరిశోధన విపంచి' అంశంపై చరిత్ర పరిశోధకుడు ఆచార్య జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ.. సగటు మనిషిని ఆవిష్కరించిన జానపద సాహిత్యంపై పరిశోధన జరగా ల్సిన అవసరం ఉందని అభిప్రా యపడ్డారు. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను, మౌఖిక సాహి త్యంతో జమిలిగా అధ్యయనం చేయడం ద్వారానే సమగ్రమవు తుందని ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి పేర్కొన్నారు. మండల కమిషన్ ఇచ్చిన చైతన్యంతో 1980 నుంచి ఉత్పత్తి కులాల సాహిత్యంపై పరిశోధనలు ప్రారంభమయ్యాయని పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఢిల్లీ అలీఘడ్‌సహా దేశంలోని 25 విశ్వవిద్యాలయాల నుంచి తెలుగుశాఖ అధ్యక్షులు 'వర్తమాన తెలుగు భాషా సాహిత్యాల గమనం, గమ్యం' అంశంపై చర్చాగోష్ఠిలో పాల్గొ న్నారు. జాతీయ విద్యావిధానం సూచించిన ట్లుగా తెలుగు శాఖలు పాఠ్యప్రణా ళికలు రూపొందించి, నిర్మాణాత్మక పాత్ర పోషించాలని హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వరరావు సూచించారు.

ఈ మూడు రోజుల తెలుగు లిటరరీ కాంగ్రెస్‌ను చరిత్రలో నిలిచిపోయేలా పలువు రు అభివర్ణిం చారు. కవులు, కళాకారులు, గాయ కులు తమ తమ ప్రతిభను చాటారు. ఈ మూడు రోజులు జరిగిన సభలు అందర్ని ఆనందపరిచాయి. ఆలోచి ంపజేశాయి. ఈ సభలో డా॥ ఎన్.గోపి, కె.శివారెడ్డి, ఆచార్య ఆర్. లింబాద్రి,ఆచార్య డి. రవీందర్, ఆచార్య తంగెడ కిషన్‌రావు, డా॥ కె.శ్రీనివాస్, ఆచార్య చింతా గణేష్, ఆచార్య సాయి కమలాకర శర్మ, డా॥ నందిని సిధారెడ్డి, గుంటూరు లక్ష్మీ నరసయ్య, డా॥ ఘంటా లక్ష్మణరావు, డా॥ఎన్. చంద్రయ్య, అట్లాడ అప్పలనాయుడు, మహ్మద్ ఖదీర్‌బాబు, డా॥కాలువ మల్లయ్య, వేణు ఉడుగుల, ఆచార్య బన్న అయిలయ్య, బండి నారాయణస్వామి, పెద్దింటి అశోక్‌కుమార్, ఆచార్య కోట్ల హనుమంతరావు, అల్లం రాజయ్య, కాసుల ప్రతాప రెడ్డి, ఆచార్య కాత్యాయని విద్మమే, డా॥ కోయి కోటేశ్వరరావు, ఆచార్య రాచపాళేం చంద్రశేఖర రెడ్డి, పి. వరలక్ష్మి, డా॥ లక్ష్మణ చక్రవర్తి, ఆచార్య సి. మృణాళిని, ఖాదిర్ మహిసుద్దీన్, గోగు శ్యామల, ఆచార్య వెలుదండ విద్యాధరరావు, కుప్పిలి పద్మ, ఆచార్య జయధీర్ తిరుమలరావు, ఆచార్య పి. సుబ్బా చారి, డా॥సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డా॥ సంగిశెట్టి శ్రీనివాస్, డా॥నలిమెల భాస్కర్, డా॥ ఎం.ఎం. వినోదిని, ఆచార్య ఎన్వీ సత్యనారాయణ, జూకంటి జగన్నాథం, పాట కవులు: అందెశ్రీ, జయరాజు, విమలక్క, యోచన, నలిగంటి శరత్, చింతల యాదగిరి, ఎం. తిరుపతి, కె. రాజా, మాష్టార్జి, వరంగల్ శ్రీను, అంబటి వెంకన్న, మిట్టపల్లి సురేందర్, ఏపూరి సోమన్న, కె. వెంకన్న, పల్లె నరసింహ కవులు: డా॥నాళేశ్వరం శంకరం, ఏనుగు నరసింహారెడ్డి, స్వైబాబా, బిల్లి యాదయ్య, అరసవెల్లి కృష్ణ, బుడిపల్లి నిరంజన్, తైదల అంజయ్య, పసునూరి రవీందర్, ఉప్పల శ్రీరాం, మేర్సి మార్గరేట్, వనపట్లసుబ్బయ్య, భూపతి వెంకటేశ్వర్లు, దర్శశయం శ్రీనివాసా చార్య, కొండెపూడి నిర్మల, శిఖామణి, యాకూబ్, అన్నవరం దేవేందర్, పగడాల నాగేందర్, సిద్దంకి యాదగిరి, పొన్నాల బాలయ్య, తగుళ్ళ గోపాల్, పల్లిపట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయ కర్తగా తెలుగు సాహిత్య మహాసభ నిర్వహణ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ సూర్యా ధనుంజయ్, ఏలే విజయలక్ష్మి, ఎస్. రఘు తదితరులు వ్యవహరించారు.

తెలంగాణ లిటరరీ కాంగ్రెస్ సదస్సులో అంపశయ్య నవీన్, అల్లం రాజయ్య, పెద్దింటి అశోక్‌కుమార్, కాశీం.

ఆ తల్లి పాటల్లోనే అనంత జ్ఞానం

కడలి అంచుల్లో పొడిచిన
ఇనబింబానికి
చేప పిల్లలు మోరలెత్తుతున్నాయి
కొమ్మల గుబురుల్లోంచి కూస్తున్న
పిట్ట కూతకు
విత్తులు పొటమరిస్తున్నాయి
పొదిగిట్లో ఉన్న శిశువు కదలికలు
తల్లిలో నవ్వులు పూయిస్తున్నాయి
శిశువు నవ్వుకు విరబూసిన
జాజి తోట పరిమళభరితమవుతుంది
సృజనమే ప్రకృతికి ఊపిరి
తల్లి పాటలోనే అనంత సంగీతం
దాగుంది
వెన్నెల పాటలు, క్రౌంచ పక్షుల
రెక్కల చప్పుళ్ళు
బిడ్డ కదలికలో ఉన్నాయి
తల్లి జోల పాటకు
మేఘాలు ఊయలలూగుతున్నాయి
నిజమే! వంద వాయిద్యాల
మోతల మధ్య ఒక్క అర్ధనగ్న దృశ్యం!
పంచేంద్రియ ఉన్మాద భరితం
జ్ఞానేంద్రియాల ప్రేరణకు
అక్షర నక్షత్ర మండల దృశ్యం!
అక్షరాలు ధ్వనులే అయితే
స్తుతులు, నుతులు ఢమరుక ధ్వనులే!
శిలలు దగ్గర తలలు వంచే బానిసత్వం
ఒక సున్నితమైన మాటతో కబీరు
అడవులకు పూత పూయించలేదా!
వివేచన ని కలిగించే
ప్రేమ సంద్రాలు పొంగించలేదా!
మనిషిలోకి మనిషిని పంపే
మానసిక విప్లవం తేలేదా!
నిజమే! జీవితం
అంతరాంతరాల్లోకి వెళ్లి
మనిషి తన్నుతాను
వివేచించుకుంటున్నాడా?
ఆ కొద్ది సమయం
తనకు కరువయ్యిందా?
లిప్త కాల పునరాలోచన లేకే
ఎవరికోసమో జీవించడం
ఆలోచన, చింతన, మథనం, వివేకం
మనుషుల అంతర్నిహిత
భావనా చైతన్యానికి మూలం
జ్ఞానం తత్త్వ జన్యం
తత్త్వం బుద్ధి కుశలతా సృజనం
సృజనం ప్రకృతి అంతరంగ జీవనం
పెను వృక్షాలు కూలిపోతున్నప్పుడు
భూమికి విషాదం
మరోపక్క పెంచుకున్న కొడుకే
మందు చెదబట్టి నిలువునా
ఊపిరి వదులుతున్నప్పుడు
తల్లి శోకానికి మేఘాలు ఆవిరవుతున్నాయి
అమ్మేవాడు కోట్లకు పడగలెత్తితే
తాగే వాడి కొంప కూలిపోతుంది
శరీరం బుగ్గి పాలవుతుంది
కుటుంబ జీవనంలో వైరుధ్యం పెరుగుతుంది
మరొకరి నుండి కోరుకోవడం
ఒక వ్యసనం
తనకు తాను సాధించుకోవడం
ఒక కర్తవ్యం
కోరికలు పుట్టడానికే బుద్ధి
అతిగా తినడానికే జిహ్వ
అర్థం లేని ధ్వనులకే
గొంతుక అయితే జీవితానికి అర్థమేముంది?
మేము తాగి చిందెయ్యడంలోనే
అనుభూతిని పొందుతున్నాం
అంటున్నవాడు గుండెకు
చిల్లులు పడ్డాక వాడిని రక్షించేదెవరు?
మత్తులో నుండి పుట్టే కళకు
వివేచనేముంది?
బుద్ధుని మేల్కొలిపే శక్తి దానికి లేదు
ఆ వైతాళికుడు ధర్మావేశము నుండి
వేసిన కేకకు సింహాలు ప్రతిధ్వనించాయి
అడవి పక్షులే వీర గీతాలు ఆలపించాయి
అందుకే వేమన
కొండ సందుల్లో నుండి
జీవ నదులు పొంగించాడు
ఒక తంబుర తో మీరాబాయి
ఆలపించిన పాటకు
చక్రవర్తులు తలవంచారు
అందుకే ప్రియురాలి కోసం కట్టిన
ఆ తాజ్ మహల్ కంటే
ఆ నిలువెత్తు అంబేద్కర్ విగ్రహమే
స్ఫూర్తివంతమైంది
నిజమే! నీవు వారిని
వర్ణం నుంచి నిషేధించి
ప్రకృతిలోకి నెట్టావు
వారు అందులోని సజీవ శక్తుల్ని
ఆవాహన చేసుకున్నారు
సృష్టి,స్థితి,లయ లకు
ప్రాపంచిక కారణాలు వెతికారు
భౌతిక తాత్వికులయ్యారు
అజేయులయ్యారు
మీరు కృత్రిమ జీవులయ్యారు
ఇప్పుడు ప్రకృతి కోసం ఆరాటపడుతున్నారు
నీరు, నిప్పు, గాలి నుండి
మీరు వెలి వేయబడ్డారు
అవి మీకు లభ్యం కాక
కృత్రిమ సృష్టిలోకి మారిపోతున్నారు
ఎందు నుండి వచ్చామో దాన్ని కోల్పోయారు
ప్రకృతి, తల్లి, సమాజం
పరస్పర సంబంధితాలు
అవే మన జననానికి మూలం
అదే చార్వాకులు చెప్పిన సత్యం
ఆ వైపు నడుద్దాం

-మహాకవి డా॥ కత్తి పద్మారావు
9849741695

కవి గాయక, వాగ్గేయకారుల ఆటపాటలతో పరవశించిన ఉస్మానియా

ఉస్మానియా విశ్వ విద్యాలయం గురించి ఏ ఆలోచన వచ్చినా నాకు ఒకే ఒక స్థిరమైన అభిప్రాయం నాకొక బ్రతుకు సోపానం. నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన పొదరిల్లు,గుడ్లను పొదిగి పిల్లలను సాకినట్టు యూనివర్సిటీ రెక్కల బొక్కల మధ్య పెరిగిన ఎన్నో తరాలలో మేమూ ఉన్నాము.తెలిసీ తెలియని వయసు చిన్న పట్టణం నుండి మహా నగరానికి ప్రయాణం. కోటి మహిళా కళాశాలలో మొదలైన నడక ఆర్ట్స్ కళాశాలకు,లేడీస్ హాస్టల్ కూ మారింది. మేము అక్కడ ఉంటున్న కాలం లోనే మలివిడత తెలంగాణ ఉద్యమంతో కలిసి నడిచాము.లేడిస్ హాస్టల్, లైబ్రరీ, ఆర్ట్స్ కాలేజ్ ఇదే మా జీవితం.

ఇవొక ఎత్తు అయితే అక్కడ అకడమిక్ వాతావరణం మరొక ఎత్తు. నిత్యం జాతీయ అంతర్జాతీయ సదస్సులు, కవితా పఠనాలు ,గోష్టులు,ఇవే మా లోకం విద్యార్థినిగా, పరిశోధకురాలిగా, ఇప్పుడు ఉన్నత విద్యారంగంలో పనిచేసే దాకా రావడం వెనక మాకు చదువు చెప్పిన గురువులు,సుద్దులు చెప్పిన మంచి మనుషులు ఉన్నారు. యూనివర్సిటీ లో అత్యున్నత డిపార్ట్మెంట్ మా తెలుగు శాఖ. గొప్ప పండితులు విద్వత్ పరులు అక్కడ పనిచేసారు. ఆ క్రమంలోనే దాని కొనసాగింపుగానే ఇప్పుడు మా తెలుగుశాఖ మూడు రోజులపాటు తెలుగు సాహిత్య మహాసభ (తెలుగు లిటరరీ మహాసభ) ఫిబ్రవరి 15,16,17 తేదీలలో గొప్పగా జరిపింది అనడం కంటే సాహిత్య ఉత్సవాన్ని నిర్వహించింది.మూడు రోజుల పాటు వందలాది మంది సాహిత్య అభిమానుల మధ్య కవి గాయక, వాగ్గేయకారుల ఆట పాటలతో ఉస్మానియా పరవశించింది. ఇది నాకొక మంచి అనుభవం. నాకు చదువు చెప్పిన గురువులు నేను చదువు చెప్పిన శిష్యులు, నా సహచర పండిత అధ్యాపకులు, శ్రేయోభిలాషుల అపూర్వ కలయిక. ప్రతి రోజు ఉదయం పదికి మొదలైతే అర్ధరాత్రి పదకొండు పన్నెండు దాకా సభలు నడపడం చిన్న విషయం కాదు. తెలుగు లిటరరీ కాంగ్రెస్ దిగ్విజయంగా నిర్వహించిన తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ కాశీం గారికి అభినందనలు.

-నిర్మల నందిగామ

సభలో ప్రసంగిస్తున్న ఆచార్య కాశీం.

భుజాలు మార్చుకుందాం !!

శవం ముఖం చూసి
ఎందుకు నువ్వు
చచ్చినట్లు భయపడుతావు !
శవం ముఖం శాంతంగా ప్రశాంతగా
బేఫికరు !
శవం గురించి
గొప్పగా పొగిడినా తిట్టినా అదే కళ !
ఉన్న ముఖం ఉన్నట్లే ఉంది
గాఢ నిద్రలో లేపినా
లేవనట్టుగా ఉంది !
శవం ముఖం చూసి
నీ ముఖాన్ని చావు కళగా
కలకలగా వెలవెలగా చేసుకుంటావేం
మహా ప్రస్థానం చేస్తున్న
నిశ్చింత చావు ముఖంలో !
ఏంత సేపు
ముఖాలు చూసుకోవడం
శవాన్ని సాగనంపాలి
పాడెను మోయండి !
బరువు ఉండొచ్చు
బరువులు దించుకున్నవాడిని
గొప్పగా మనం
బాధ్యతగా మోయాలే !
మనవాడే కదా !
ఏం బరువు !
తేలికైనాడుకదా!
భుజాలున్నదే మోయడానికి
భుజాలు సార్థకమౌతాయి
భుజ కీర్తులౌతాయి.
చావు ముఖంలో
స్వర్గప్రాప్తి అవుతున్న
ఆనందం నీకు కనిపించడం లేదా !
ముఖం మార్చుకో
భుజాలు మార్చుకుందాం.
ఇంటికి వెళ్లి దీపం చూసి వద్దాం
అల్కగా అవుదాం
జ్యోతిర్మయంగా మన దోస్త్

-కందాళై రాఘవాచార్య
8790593638

పుస్తక పఠనంతో మంచి తరం వెలుగులోకి...

సభలో ప్రసంగిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

పుస్తక పఠనం సమాజంలో మంచి తరాన్ని సృష్టిస్తుందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. సాహిత్యాన్ని గౌరవించేందుకు రాజ్‌భవన్ వెల్లంకి గ్రామానికి వచ్చినట్లు పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలరం వెల్లంకి గ్రామం లో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య నిర్వహిస్తున్న 'ఆచార్య కూరెళ్ల గ్రంథాలయ' నూతన భవనా న్ని సోమవారం రాత్రి గవ ర్నర్ తమిళిసై ప్రారంభించి మాట్లాడారు. సాహిత్య రంగంలో కూరెళ్ల చేసిన కృషి తెలంగాణ రాష్ట్రపటంలో వెల్లంకి గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని తెలి పారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఈ గ్రంథాలయం ఉప యోగకరంగా ఉంటుందని పేర్కొన్నా రు. విఠలాచార్య ప్రతి ఒక్కరికి రోల్ మోడల్ అని, రాబోయే తరాలు చదవడానికి పుస్తకాలు అందిస్తున్న ఆయనకు సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. పుస్తక పఠనం కోసం కృషి చేస్తున్న ఆచార్య కూరెళ్లను గౌరవించిన దుకు సంతోషంగా ఉందని ఈ గ్రంథాలయానికి రూ. 10.67 లక్షలు మంజూరు చేస్తూ పత్రాలు అందజేశారు. గ్రంథాలయానికి వస్తున్న యువతకు ఉపయోగకరంగా ఉండే 8,500 పుస్తకాలు, వెయ్యి రాత పుస్తకాలు బహూకరించారు.

ఆచార్య కూరెళ్లను సత్కరిస్తున్న గవర్నర్ తమిళిసై

గవర్నర్ తెలుగు ప్రసంగాన్ని ఆంగ్లంలో తర్జుమా చేసుకుని తెలుగులో స్పష్టంగా ప్రసంగించడంతో సభకు హాజరైన ప్రముఖులు, గ్రామస్థులు ఆసక్తిగా విన్నారు. తొలుత సాయి సభా మందిరాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ ప్రారంభించారు. విజ్ఞానం పెరగాలంటే గ్రంథాలయాలు అవసరమని, వీటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన అన్నారు. కూరెల్ల గ్రంథాలయాన్ని డిజిటలైజేషన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో గవర్నర్ కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జండగే, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, కవులు, రచయితలు, సాహిత్య ప్రముఖులు పాల్గొన్నారు.

కవి రచయిత డా॥ పోరెడ్డి రంగయ్య సభకు వ్యాఖ్యాతగా అందర్ని ఆకట్టుకున్నారు.

సునందామృతం

చర్విత అంటే నమల బడినది,కొరకబడినది,తినబడినది లేదా రుచి చూడబడినది అనే అర్థాలు ఉన్నాయి.

చర్వణం అంటే నమలుట, తినుట,ఆస్వాదం చేయుట,ఆనందం పొందుట అనే అర్థాలు ఉన్నాయి.

చర్విత చర్వణం అంటే నమిలిన దానినే మళ్ళీ నమలడం. చేసిన పనినే మరల మరల చేయడం అని అర్థం.

నమిలిందే మరల నమిలినట్లు . చేసిందే ఉపయోగం లేకున్నా మళ్ళీ చేయడాన్ని ఉద్దేశించి ఈ చర్విత అప్రస్తుతమా... ఏమీ చూసుకోరు. ఇలా చేసేవారిని ఉద్దేశించి తెలుగులో ఓ సామెత అంటుంటారు "పాడిందే పాడరా...!"అన్నట్లుందని.

దీనికి ఓ చిన్న సరదా కథ ఉంది. ఓ పిల్లవాడికి ఆవు గురించిన అంతో ఇంతో తెలుసు తప్ప మరో విషయం తెలియదు. అదెలా అంటే 'ఆవుకు నాలుగు కాళ్ళు ఉంటాయి.తోక వుంటుంది. ఆవు గడ్డి మేస్తుంది.ఆవు సాధు జంతువు.ఆవు పాలు ఆరోగ్యానికి మంచివి'.ఇలా అన్న మాట.అది తప్ప ఇంకేం రాదు.

చర్విత చర్వణ న్యాయము

చర్వణ న్యాయమును ఉదాహరణగా చెబుతుంటారు.

ఆవు, గేదె లాంటి జంతువులు మేత మేసేటప్పుడు గబగబా మేస్తాయి.ఆ తర్వాత నింపాదిగా నోట్లోకి తెచ్చుకుని నెమరు వేస్తాయి. అలా చేయడాన్ని చర్విత చర్వణం అంటారు.అది పశువులకు సంబంధించినది.

కానీ కొందరు చేసిందే చేస్తూ, చెప్పిందే చెబుతూ,రాసిందే రాస్తూ వుంటారు. అందులో కొత్తదనం ఏమీ ఉండదు.అలా చేయడం వల్ల ఒనగూరే అదనపు లాభం ఏమీ వుండదు. చూసే వారికి విసుగు, చేసేవారికి శ్రమ తప్ప.

అలాంటి సందర్భాలు కొన్ని ఉంటుంటాయి.కొందరి ఉపన్యాసాలు వింటుంటాం. వాళ్ళు ఎక్కడ మాట్లాడినా ఒకే విషయం,ఏ సందర్భంలో నైనా ,ఏ వేదిక మీదనైనా సరే చెప్పిందే చెబుతూ ఉంటారు.

సమయం సందర్భం,ప్రస్తుతమా, ఒక సారి వాళ్ళ గురువు గారు ''పిల్లలూ విమానం గురించి రాయండి" అన్నారట. ఆ పిల్లవాడు వీర లెవల్లో రాశాడు ఆకాశంలో విమానం పోతా వుంది. అందు లోంచి కిందకు చూస్తే ఓ పెద్ద మైదానం కనిపించింది.అ ందులో గడ్డి మేస్తూ ఓ ఆవు కనిపించింది.ఆ ఆవుకు నాలుగు కాళ్ళు... తనకు తెలిసిన ఆ ఒక్క విషయాన్నే మరల రాశాడు తప్ప ,అడిగిన విమానం గురించి మాత్రం రాయలేదు.

ఇలా ఏ అంశం ఇచ్చినా అటూ ఇటూ తిప్పి చివరికి ఆవు గురించే రాసే వాడు. ఇదిగో ఇలా విసిగించ డాన్నే చర్విత చర్వణం న్యాయము గా చెప్పుకోవచ్చు.

-పురిమళ్ల సునంద
9441815722

పాజిటివ్ ఆలోచనలతో జీవన సాఫల్యత

ఆలోచన మనిషికి దేవుడిచ్చిన వరం. ఆలోచన గొప్ప ఆయుధం. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగాలంటే ఉన్నత స్థాయిలో రాణించాలంటే సరైన ఆలోచనలే దిశ దశను నిర్దేశిస్తాయి. మనకు భయం కలిగించే విషయాల మీద బాధ కలిగించే వాటి పైన మన ఆలోచనలు కేంద్రీకరించడం మానుకోవాలి. వర్తమానంలో కావలసిన విషయాల మీద దృష్టి పెట్టితే జీవితం మారుతుంది. వ్యతిరేక ఆలోచనలు మనిషిని ఆందోళనకు గురిచేస్తాయి. మంచి ఆలోచనలు మనసుకు శక్తి నిస్తాయి. 'రాజీపడే మానసిక వైఖరిని పెంచుకోవాలి' అనుకున్నవి అన్ని జరుగవు .అనుకోవడమే మనిషి పని అని రాజీ పడే మనస్తత్వాన్ని పెంచుకోవాలి.

అనుకున్నవి జరుగక పోతే కుంగి పోవద్దు. మన ఆలోచనలను పునఃహః పరిశీలన చేసుకోవాలి. మనకు బాధ కలిగినప్పుడు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ప్రతికూల భావనలకు దూరంగా పాజిటివ్ భావనలకు దగ్గరగా జీవించాలి. టివిలో నచ్చని చానల్ మార్చినట్లే మనసు అనే రిమోట్‌తో చెడు ఆలోచనలకు చెక్ పెట్టాలి.

పాజిటివ్ ఆలోచనలు ఉజ్వల భవిష్యత్తు పునాది వేస్తాయి . మనిషికి చెడు ఆలోచనలు వస్తే ఉన్న స్థితి నుంచి పతన స్థితికి తీసుకువెళతాయి. మన ఆలోచనలే మన జీవితాన్ని మార్చడమే కాకుండా ఇతరుల జీవితాలను ప్రభావితం చేస్తుంది. మన ఆలోచన మనం చేయాల్సిన పనులను చేరుకోవలసిన గమ్యాలను, లక్ష్యాలను చేరడానికి అవసరమైన సంకల్ప బలాన్ని సమకూరుస్తుంది.

డిజిటల్ యుగం – తగ్గిన సంబంధాలు

ప్రస్తుతం డిజిటల్ యుగంలో స్మార్ట్ ఫోన్ అడిక్షన్ పెరిగింది. కుటుంబ సభ్యులు ఒకే చోట ఉన్నప్పటికి పలకరింపులు లేక ఫోన్ మెసేజెస్, షేరింగ్స్‌కు అంకితమై కేరింగ్ కరువైంది. , సృజన తగ్గింది ఆందోళన పెరిగింది. నూతన సాంకేతికత వినియోగం పెరిగి మానవ సంబంధాలు దురమైనాయి. మానవునిలో కొత్త ఆలోచనలు కనుమరుగైంది. మనిషిలో సృజనాత్మకతను ఆలోచించే విధానాన్ని మార్చివేసింది. మానవుడు సాంకేతికతపై ఆధారపడి పరాన్న జీవిగా తన జీవనశైలిని ఏర్పాటు చేసుకోవడం వల్ల డిజిటల్ యాంత్రిక కబంధహస్తాల్లో చిక్కుకుపోయి స్వతహాగా ఆలోచించే తత్వాన్ని అవకాశాన్ని కోల్పోయాడు. నేడు మానవునిలో మానవీయత, అవగాహన ఆత్మీయత అభిమానం ప్రేమ అనురాగాలు సౌహార్దత, సమన్వయత సహకారం, సంఘీభావం లోపించి జీవితం సంఘర్షణల మయమై సమస్యల్లో కూరుకుపోయి జీవితాలలో ఆందోళనలను ఆహ్వానిస్తూ ఒంటరిగా జీవితాన్ని గడిపే గడ్డు పరిస్థితులు దాపరించడం శోచనీయం.

మెరుగైన సంబంధాలు పాజిటివ్ ఆలోచనలు

మంచి మార్గంలో పయనించాలంటే పాజిటివ్ ఆలోచనలు కలిగి ఉండాలి. సమాజంలో పారదర్శకమై సంబంధాలు ఉండాలి. మెరుగైన సంభందాల బంధాలు, అనుబంధాలు ఆత్మీయతలు, మంచి ఆలోచనలకు ఆలంబనగా నిలుస్తాయి. ఒక మంచి మిత్రుడు తన స్నేహితుని ఆలోచనలకు సరైన మార్గం చూపుతాడని పెద్దలు చెప్తారు. సరైన ఆలోచనలు మనిషిని ప్రగతి, పురోగమనం వైపు పయనింపజేస్తాయి. ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి పడుకోబోయే ముందు ప్రతి మనిషి 6000రకాల ఆలోచనలు చేస్తాడని మనిషి ఆలోచనల మీద పరిశోధన చేసిన కెనడాలోని క్వీన్స్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం తెలిపింది. ప్రపంచ ఆలోచనల దినోత్సవం సందర్భంగా మంచిఆలోచనలు చేద్దాం. మంచి మార్గం వైపు పయనిద్దాం. మనిషికి క్రమశిక్షణతో కూడిన జీవితం అవసరం.ధ్యానం మనిషి అంతరంగాన్ని శుద్ధి చేస్తుంది.

మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం

మానసిక ఆరోగ్యం మానసిక బలాన్ని పెంచుతుంది. పాజిటివ్ ఆలోచనలు మనిషికి మహాభాగ్యం. నా ఆలోచనల మీద నాదే అధికారం అని మనము తరచూ అనుకోవాలి.

నా సుఖ దుఃఖాలకు భోగ భాగ్యాలకు నా ఆలోచనలే కారణం.

ఆలోచనలు జీవన సాఫల్యత, బలమైన ఆలోచనలే మన జీవితానికి అద్దం. మన ఆలోచనలే మనజీవితంగా రూపు దాలుస్తాయి. మన శక్తి సామర్థ్యాలను ఇనుమడింప చేస్తాయి. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా అభివృద్ధి పథంలో పయనించాలి. త్యాగం, అంకితభావం, తెగింపు, కర్తవ్య నిష్టతో నిరాశా, నిస్పృహలు వీడి ఆశయాల సాధనే జీవిత లక్ష్యం కావాలి. మనం ఏ విషయాలు మీద దృష్టిని కేంద్రీకరిస్తామో అదే మన జీవితం.

(ఫిబ్రవరి 22 ప్రపంచ ఆలోచనా దినోత్సవం సందర్భంగా)

–నేదునూరి కనకయ్య
9440245771

పుడమిని ముద్దాడిన పొద్దు

పొద్దు ఎప్పుడూ పుడమిని
ముద్దాడాలనే చూస్తుంది...
తను మద్దతు ఇస్తూ
ముద్దు ముద్దుగా లేత కిరణాలతో
నిలువెల్లా నేలంతా
పరుచుకొంటుంది...
అణువణువునూ స్పర్శించి
తన చైతన్యాన్ని చేరవేస్తుంది...
మానవ జీవితాలకు ఆయువు పోస్తుంది..
ఓ చైతన్య క్రాంతితో
ప్రశాంతమైన కాంతి అందిస్తుంది...
రంగు రంగుల ఇంద్రధనుస్సు వర్ణాలతో
ఆహ్లాదం పంచుతుంది!!...
పుడమి తన ఒడిలో చేర్చుకుంటుంది..
సమస్తాన్ని తన గుండెలో దాచుకుంటుంది
ఈ తల్లికి ఎంత ఓర్పు!!??
వేడిమిని భరించి తాపాన్ని సహించి
మన పాపాలను మోస్తుంది...
శాపాలను హరిస్తుంది!!...
తన కడుపులో గుణపాలేసి తవ్వినా...
గుండెను పగులుగా చీల్చినా...
మట్టి దిబ్బలుగా పోసినా...
ఓర్పుతో అన్నీ భరిస్తుంది!!...
ఈ తల్లిది
కఠిన పాషాణ హృదయం కాదు
ప్రేమామృతం పంచే హృదయం!!..
లోపల రగులుతున్న అగ్నిని భరిస్తుంది..
ఎదపై మనం చేసే గాయాలను భరిస్తుంది
ప్రకృతికి ప్రాణం పోస్తుంది...
ప్రాతఃకాల సూర్యకిరణాలతో
తలంటు స్నానం చేయిస్తుంది...
అందుకే నెలంతా
పచ్చని రూపంతో ఉంటుంది!!
ఆకాశం దుఃఖించాలి...
నా తనువంతా తడవాలి...
పొత్తిళ్ళు తడిస్తే
పులకరించి ఆడుతా!!...
నా కడుపులో విత్తులు నాటి..
చక్కని పంటలు పండి..
సుఖంగా అందరూ ఉంటే..
అప్పుడే నాకు నిజమైన చైతన్యం!!...
నీళ్లు నా కడుపును నిమురుతుంది..
వేడిమి నా తలను నిమురుతుంది..
మానవులు నా తనువంతా గుల్లచేసి
వత్తిళ్లతో నా పొత్తిళ్లలో పొడుస్తారు!!..
తల్లిగా అన్నీ భరిస్తూ ఉంటాను...
అన్నీ బాధలు మరిచి పోతాను..
వాళ్ళ కడుపు నింపడానికి
నా కడుపులో పొడుస్తారు!!...
కాలం నా మీదనే కరవాలం..
నా మీదనే మానవలోకం...
నా మీదనే అన్నిటికీ..ఆదరణ నేనే!!
ఎక్కడ తడిమినా నా మీదనే...
ఏది వెతికినా నాలోనే...
అంతా నేనే!!
అందరికీ నేనే!!
సమస్తానికి తల్లిని నేనే..!!

–అంబటి నారాయణ
9849326801

అమ్మభాష

మమకారపు జల్లులు
వెదజల్లుతూ మాటల్లో
మధురిమలొలికే తీయనైన
భాష మన మాతృభాష–
మది తలపులు తెరచి,
తుది పలుకుగా నిలచి,
మమతల పూతను పూసే
పుప్పొడి మన మాతృభాష–
భావాలను భాషతో ముడివేస్తూ,
మొదటి పలుకై ముసిముసిగా
అమ్మ ముఖంపై మెరిసిన
చిరునవ్వు మన మాతృభాష–
అనురాగపు ఆనవాలు
అందిస్తూ బంధాల్లో
అనుబంధాల ఆధారాలు అద్దే
ఆయుధం మన మాతృభాష–
ఏకధాటిగా వర్షిస్తూ
ప్రాణధారలా
నిత్యం నాలుక నుండి
ప్రవహించు ఆలోచనల
జలపాతం మన మాతృభాష–
బహుభాషా ప్రపంచంలో
ప్రపంచం పరిచయమయ్యే
వరకు నిత్యం నీడలా తోడుండే
అమ్మభాష మన మాతృభాష–
భాషాలెన్ని నేర్చినా
దేశాలెన్ని చుట్టినా
ఆధునికత హంగుల్లో పడి
వీడకూడని వినసొంపైన
భాష మన మాతృభాష–
(అంతర్జాతీయ మాతృభాషా
దినోత్సవ శుభాకాంక్షలతో)

–షేక్.నసీమా బేగం
9490440865

మనిషెంత మంచోడో?

కాంతివేగాన్ని అధిగమించి..
పాలపుంతలో పాగావేసి..
గ్రహ వాసిగా గగనాన్ని జయించి..
అంతరిక్ష అంతరంగాన్ని ఆవిష్కరించి..
నేలపై నడక, నడత మరచిన మేధావి
ఎదిగాడో కదా నడవంత్రపు నరుడు
గాలి నేల నీరు ప్రకృతి ప్రసాదాలు
తన స్వంతమని తలచి..
గాలిని గలీజు గత్తర లేపి..
మట్టి శీలాన్ని మంటగలిపి..
జలానికి కంపు జ్వరాన్ని తెప్పించే..
మనిషెంత దయామయుడో కదా
హత్యలే ఆర్షతగా అధికారాలు
స్వార్థమే పరమార్థమైన సంబంధాలు
నీతిని పాతరేసే ఉద్యోగపర్వాలు
ధనతీపి చుట్టు ఈగల్లా మనుషులు
విలాసాల ఉచ్చులో విలువల విలవిలలు
ఆమెకేసి అశ్లీల చూపుల విషబాణాలు
మనిషెంత మాయదారి టక్కరో కదా !
అంతర్జాల మత్తులు గమ్మత్తులు
స్మార్ట్ ఫోన్లతోనే నిత్య సంసారాలు
గూగులమ్మ ఒడిలో నీలిసంద్ర మునకలు
డిజిటల్ దెయ్యాలైన సామాజిక మాధ్యమాలు
విశ్వమే కుగ్రామమై కుచించిన బతుకులు
అభివృద్ధి అందలం, మనసులు అధమం
మనిషెంత మరయంత్రమయ్యాడో కదా !.
ఎదిగిన కొద్ది ఒదిగే తపనలు
మానవత్వానికి పట్టాభిషేకాలు
హృదయ చెలిమెలో విలువల ఊటలు
వసుదైక కుటుంబ హార్దిక అనుబంధాలు
పర్యావరణ పరిరక్షణకే పవిత్ర యజ్ఞాలు
మహాత్మున్ని చేయాలె మనిషి ప్రయత్నాలు
రేపటికి కావాలె ఉషాదయ వెలుగులు !

–మధుపాళీ
99497 00037

పుస్తక సమీక్ష

కర్షకుని కలం నుండి జాలువారిన కవిత్వం!

మంచి చెడు విచక్షణ
తెలిసి మెలగగలిగామంటే
ముమ్మాటికీ
ఈ మట్టీ చలువేనని భావించే కవి బొమ్ము ఉమామహేశ్వర రెడ్డి 'బతుకు వర్ణం' కవితా సంపుటిని వెలువరించారు. రైతు కుటుంబ నేపథ్యమున్న ఉమా మహేశ్వర రెడ్డి గత ఐదు దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తూ.. కవిత్వ సృజనను ప్రవృత్తిగా చేసుకుని జీవనం కొనసాగించడం విశేషం!

మట్టిని ప్రేమించే వాడు
మనిషినీ ఆదరిస్తాడని
విశ్వసించే ఆయన.. మట్టీ, మనిషి మమేకమైతే.. మానవత్వపు పంట విరగ పండినట్లేనని నమ్ముతూ 'బతుకు వర్ణం' కవితా సంపుటిలోని కవితలకు అక్షరాకృతినిచ్చారు.

అప్పట్లో మావూరు మొత్తానికి
ఒకే మంచినీళ్ళ బావి
అందరం ఆ నీళ్ళే తాగే
వాళ్ళమనీ.. ఇప్పుడు–
రకరకాల బ్రాండెడ్ నీళ్ళ ప్యాకెట్లు, పాలప్యాకెట్లు ఇప్పుడు మా ఆత్మ ప్లాస్టిక్ పరిమళం అంటూ "ఆత్మ" సాక్షిగా కవితను తీర్చిదిద్దారు. ప్రపంచీకరణ నేపథ్యంలో.. పల్లెలు పరాయీకరణకు పరాకాష్ట అయిన వైనాన్ని నర్మగర్భంగా ఆవిష్కరించారీ కవితలో..

కవి బొమ్ము ఉమా మహేశ్వర రెడ్డి ఈ పుస్తకంలో పొందుపరిచిన 25 కవితల్లో ఆయన యొక్క సృజనాత్మక ప్రతిభను చూస్తాం. వస్తు ఎంపికలో వైవిధ్యం.. అభివ్యక్తిలో కొత్తదనం.. అడుగడుగునా కాన వస్తుంది. కవి కర్షకుడు కనుక.. మంచెకాడ, దగాదిశలో.. బతుకు వర్ణం, వంటి కవితల్లో వ్యవసాయం.. పల్లెతో ముడిపడి ఉన్న అంశాలను.. మట్టి.. మట్టితో వున్న అనుబంధాన్ని సాధికారికంగా తమ భావ ప్రకటన చేయగలిగారు. వ్యవసాయ సంబంధ అంశాలేగాక.. సామాజిక సంఘటనలను మానవ సంబంధాలను.. కుటుంబ వ్యవస్థ వంటి వాటిని కూడా ఎంపిక చేసుకుని కవిత్వాన్ని పండించే ప్రయత్నం చేశారు.

ప్రతులకు:
బొమ్ము
ఉమామహేశ్వర రెడ్డి
తండ్రి బి.రామిరెడ్డి (క్రీ॥విఎం)
వేణుగోపాలస్వామి దేవాలయం
ఎదురుగా, ఆత్మకూర్ (పో)
మంగళగిరి మం॥,
గుంటూరు జిల్లా– 522 503
సెల్: 94402 14705

"బతుకు వర్ణం" కవితలో
అన్నం ముద్దపై
నా సంతకం
ఓ అరుణ కాంతి.. అని కవి ఓ రైతుగా తమ స్వాభిమానాన్ని ప్రకటించుకున్నారు.

'తెగిన పేగు' కవితను ఆర్ద్రంగా రూపుదిద్దారు. కన్నవారిని.. ఉన్న ఊరుని వదిలి నగరాలకు వలసవెళ్లిన వారి గురించి రాసిన పంక్తులు అందరినీ కదిలిస్తాయి.

అగ్గి పెట్టెల్లాంటి అపార్ట్‌మెంట్లలో
మనసులు కూడా ఇరుకు ఇరుకే'నంటూ వ్యాఖ్యానించారు.

పేగు తడిమే తల్లి
నడత నేర్పిన తండ్రీ
బెడ్రూం సంస్కృతికి బలి అంటూ వాపోయారు.

అమ్మానాన్నంటే
ఎంత ప్రేమ.. పాపం!
గుండెల్లో కాస్త చోటు కరువై
వృద్ధాశ్రమానికి భూరి విరాళం యిస్తారు అంటూ నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టారు.

కర్రీ పాయింట్స్, కిట్టీ పార్టీలు
నేటి మహిళల
మోడ్రన్ చర్చావేదికలు అంటూ వ్యాఖ్యానించారు. "తెగిన పేగు" కవితలో...

మనక బారుతున్న మానవ సంబంధాలను.. బంధాలు.. అనుబంధాలను "ఆర్థిక "బందీలు" కవితలో చక్కగా ఆవిష్కరించారు.

"కాసుల" వ్యామోహంలో
బంధాలన్నీ పుట్టుకతోనే తెగి పోతున్నాయని కవి తమ ఆవేదనను వ్యక్తపరిచారు.

ఆప్యాయతలు, అనురాగాలు మనీతో ముడిపడి ఉన్నాయన్న అర్థం ధ్వనించేలా.. బంధాలన్నీ నేడు ఆర్థిక బందీలైనాయని వాపోయారు. కుటుంబ సభ్యుల మధ్య... ప్రేమాభిమానాల పందిరి కావాలనీ.. మనుషుల మధ్య మానత్వపు వంతెన నిర్మించాలని ఆకాంక్షించారు.

"ఉభయ కుశలోపరి" కవితలో ఆధునిక సాంకేతికత ఉత్తమ సంస్కారానికి చిహ్నమైన ఉత్తరం కనుమరు గైందని కవి తమ వేదనను ప్రకటించారు.

"మా ఊరి ఊడల మర్రి" కవితలో తమ ఊరుతో ఉన్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

ఎన్నో సంవత్సరాల
ఆకుపచ్చని జ్ఞాపకాలకు
నిలువెత్తు సంతకం
మా ఊరి ఊడల మర్రి అంటూ కవితను ఎత్తుకున్న తీరు బాగుంది.

మర్రిచెట్టు నీడన ఒకనాడు పొందిన అనుభవాలను, అనుభూతులను ఈ కవితలో నిక్షిప్తం చేశారు. ఒకనాడు పల్లె సమస్యలకు ఊడలమర్రి సమాధానమయ్యే మేదో మథన కేంద్రం అయ్యేదనీ.. ఇప్పుడు యిక్కడ పలకరింపుల పర్వంలేదని తమ బాధను ప్రకటించారు.

ఒకవైపు చతుర్ముఖ పారాయణం– మరోవైపు నీతిమాలిన రాజకీయ చర్చలు.. చుట్టలూ.. బీడీలు.. కాల్చుకుంటూ యువకులు.. అప్పుడప్పుడు కన్నీటి బొట్టులా రాలుతున్న ఆకుల చప్పుడు అంటూ ఊడల మర్రిని దృశ్యమానం చేసిన తీరు బాగుంది. కవిత్వానికి కాదేదీ అనర్హం అని శ్రీశ్రీ గారన్నట్లు కవి ఉమా మహేశ్వర రెడ్డిగారు "మంచె"పై కవితను రాసిన మెప్పించారు.

పల్లె పదాల పాటలకు
పంట చేను పరవశమై
ఉర్రూతలూగుతుందనీ..
పాలుపోసుకున్న కంకిని చూస్తే
అన్నదాత గుండెనిండా సంబరమనీ.. అహర్నిషలూ కండలు కరిగించి
పెంచిన పంటకు
'మంచె' ఓ రక్షణ కవచమని తేల్చి చెప్పారు.

మంచె నిలబడ్డాక
మా కడుపు నిండదమే కాదు
ప్రకృతి సౌందర్యంతో
మనస్సు పులకరింపజేస్తుందనీ..
మంచెకున్న నాలుగు గుంజలు
సిరుల పంట పక్వానికి పటిష్ట పునాదులవుతున్నాయని కొనసాగించడం బాగుంది.

'విజయభేరి' కవితలో గింజ విలువే కాదు.. కన్నీటి ఖరీదూ.. కష్టజీవికే తెలుసు అంటూ ఆవిష్కరించారు.

మనం గాంధీ అంత నాయకులం కానవసరం లేదు.
"మనిషి"గా మసలుకుంటే చాలు.
అప్పుడు–
గుండె గూటిలోంచి– స్వార్థపు చీడ వీడి పోతుందని తెలియజెబుతూ "మనిషి అయితే చాలు" కవితను రాశారు.

ఇలా ఎన్నో కవితలు.. అలతి అలతి పదాలతో ఆలోచనాత్మక భావనలతో కవి రెడ్డిగారు ఈ గ్రంథంలో పొందుపరిచారు. మున్ముందు మరింత కవిత్వాంశతో మరిన్ని కవితా సంపుటాలు వెలువరించాలని కోరుకుందాం.



– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

శ్రమకు అక్షరాభిషేకం శివకుమార్ కవిత్వం

–అమరావతి సాహితీ మిత్రులు సభలో డా రావి రంగారావు

శ్రమకు అక్షరాభిషేకం శివకుమార్ కవిత్వం అని ప్రముఖ సాహితీవేత్త డా. రావి రంగారావు తెలియజేశారు. అమరావతి సాహితీ మిత్రులు గుంటూరు బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం నిర్వహించిన సాహిత్య సభలో ఆయన పాల్గొని "పేరిసెట్ల శివకుమార్ కవిత్వం" గురించి ప్రసంగించారు. శ్రామికులు, కర్షకులు, గ్రామీణ జీవన వాతావరణం, నగరీకరణ దుష్ప్రభావం, ఆధునిక సమాజంలోని వెర్రిపోకడల్ని శివకుమార్ చక్కని కవిత్వంగా వెలయించారని చెప్పారు. సరికొండ నరసింహరాజు కవితల సంపుటి "తల్లడిల్లే తల్లి వేరు" గురించి ప్రముఖ సాహితీవేత్త డా. మైలవరపు లలిత కుమారి ప్రసంగించారు. మాతృ భాష విలువ గురించి, దేశభక్తి గురించి, అనేక సామాజిక సమస్యల గురించి నరసింహరాజు చక్కని కవిత్వం రాశారని వివరించారు. "ఈ మాసం కవి"గా పరాంకుశం కృష్ణవేణి (ఒంగోలు) పాల్గొని అనేక కవితల్ని వినిపించి సభను అలరింప చేశారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహణలో జరిగిన కవితా పఠన కార్యక్రమంలో విష్ణుమొలకల భీమేశ్వర ప్రసాద్, వి. వి. రావు, చల్లా సత్యవతి, రేపల్లె రాజ్‌కృష్ణ, గడల శివప్రసాద్, వెదుళ్లపల్లి పల్లి సాంబ శివరావు, ధనుంజయరెడ్డి, మేడిశెట్టి యోగేశ్వరరావు (మచిలీపట్నం), ఎస్ కనకదుర్గ, డాక్టర్ సూర్యదేవర రవికుమార్, కనగాల జయ కుమార్, షేక్ రహీం సాహెబ్ (తెనాలి), సౌపాటి ప్రభాకర్, కమలారామ్ (వినుకొండ) మొదలైన కవులు పాల్గొన్నారు. సంస్థ పక్షాన డా. రావి రంగా రావు, కన్వీనర్ పింగళి భాగ్యలక్ష్మి, యర్రగుంట్ల పాణిరావు ఈ మాసం కవిగా పాల్గొన్న కృష్ణవేణిని, నిక్కచ్చి కవితకు ఎంపికైన డా. సూర్యదేవర రవికుమార్ ను, సంస్థకు బ్యాడ్జీలు రూపకల్పన చేసిన వి. వి. రావును ఘనంగా సత్కరించారు. అనంతరం అమరావతి సాహితీమిత్రు లు విశిష్ట సభ్యులకు బ్యాడ్జీలను సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు అందజేశారు.

పుస్తక సమీక్ష

"కరీంనగర్ జిల్లా" పెద్దలు రాసిన పిల్లల కథలు

పిల్లలు కథలు అంటే చెవి కోసుకుంటారు . ఎంతో ఆసక్తి చూపెడతారు ఒకప్పుడు పెద్దలు చెప్పే కథలను పిల్లలు వింటూ హాయిగా నిద్రపోయేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. పిల్లలకు కథలు చెప్పే వారు లేకుండా పోయారు. మరి అలాంటి లోటును తీర్చడానికి బాల సాహిత్య కారులు బాలసాహిత్యంలో విరివిగా కథలను అందిస్తూ, పిల్లలు చదివే విధంగా చక్కటి నీతిని అందజేస్తున్నారు. నైతిక విలువలు సక్రమమైన ప్రవర్తన మంచి చెడులను చెప్పే బాధ్యతను తీసుకున్నారనడంలో ఎంత మాత్రం సందేహం లేదు .పిల్లలకు పాఠ్యపుస్తకాలతో సమానంగ జ్ఞానాన్ని అందించేది కచ్చితంగా బాల సాహిత్యమే. ఇవి పిల్లలలో ఆలోచన నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి .వారిలో సృజనాత్మకతను పెంచుతాయి .పిల్లల్లో సంస్కారాన్ని కుటుంబ మానవ విలువలను పెంపొందించడంలో బాల సాహిత్యం అత్యంత ప్రభావాన్ని చూపుతుంది. ఎదుగుతున్న పిల్లలను ఉన్నతులుగా ధైర్యవంతులుగా ఆలోచన పరులుగా తీర్చిదిద్దడంలో తోడుపడుతుంది.

"కరీంనగర్ జిల్లా పెద్దలు రాసిన కథల "ఎంపిక కోసం 34 కథలు రాగా కథల కార్యశాలలో పాల్గొన్న నిష్ణాతులైన బాలసాహితీ వేత్తలు ఆణిముత్యాలు లాంటి 18 కథలను ఎంపిక చేశారు .మణికొండ వేద కుమార్ చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ అకాడమి చైర్మన్ గా గరిపల్లి అశోక్ కన్వీనర్ గా ,బాల చెల్లిని ఆధ్వర్యంలో ప్రచురించడం అభినందనీయమే.

కరీంనగర్ జిల్లా పెద్దలు రాసిన పిల్లల కథలు అనే పుస్తకంలో "ఒంటెల స్నేహం" అనే కథలో ప్రతి విద్యార్థికి స్నేహం విలువ గురించి తెలియజేస్తుంది. ఈ కథను గుండు రమణయ్య గారు రాశారు. ఈయన పెద్దపల్లి జిల్లా కు చెందిన వారు . ఈ కథలో మంచి విషయాలున్నాయి. ఇవి ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిందే. ఈ కథలో నీతి ఏమిటంటే పరస్పరం అర్థం చేసుకున్నప్పుడే స్నేహం పది కాలాలపాటు సజీవంగా ఉంటుంది .ఈ కథలో పాత్రలు ఒంటెలు .రచయిత స్నేహం గురించి చాలా గొప్పగా చెప్పారు.



–ప్రతులకు:
బాల చెలిమి
భూపతి సదన్ హిమాయత్ నగర్,
హైదరాబాద్.

"మార్పు" అనే కథలు ఒక తల్లి రాధా కొడుకు కిరణ్ చెట్లు మనకు ఏ విధంగా ఉపయోగపడతాయి. మార్పు మనలో ఏ విధంగా రావాలి హనీ కథ మనకు చాలా బాగా తెలియజేస్తుంది. ఈ కథను సిరిపురం వాణిశ్రీ రేకుర్తి గ్రామానికి చెందినవారు రాశారు. ఈ కథలో మార్పు ఎలా రావాలి అనే దాని గురించి చాలా బాగా చెప్పారు ఈ కథ నాకు చాలా నచ్చింది.

"మర్రిచెట్టు" అనే కథలో పాత్రలు రాజు, మర్రిచెట్టు. కోతులు ,రాజ్యాలు సైనికులు ఆ గ్రామం పేరు అవంతిపురం ఆ రాజ్యానికి రాజు రాజా రవి వర్మ ఆయన చాలా తెలివైన వారు. ఈ కథను రాసిన వారు పుల్లూరు జగదీశ్వర్ రావు గారు చాలా చక్కగా ఈ కథను సులభంగా అర్థమయ్యే విధంగా రాశారు.

ఈ కథలో యుద్ధం జరిగితే మన రాజ్యాలు వేరే రాజ్యాల వారు వశ పరుచుకుంటే ఏ విధంగా మనం మన రాజ్యాలను తిరిగి తెచ్చుకోవాలో అనే గొప్ప సందేశాన్ని ఇచ్చారు.

"అబద్ధం" అనే కథలో పాత్రలు తల్లి తండ్రి పాప. ఈ కథలో కడుపునొప్పి అని అబద్ధం చెప్పి స్కూల్ కి డుమ్మా కొడితే మనకు ఏదైనా సంఘటన ఎదురై ఎంతలా బాధపడతామో మనం బాధపడిన మన తల్లిదండ్రులు మనల్ని శిక్షించకుండా మన తప్పును క్షమించి మనల్ని ఏమీ అనరు. అబద్ధం ఇంకొక్కసారి ఆడకూడదు అని చెప్పుతారు. మనం కూడా తల్లిదండ్రులకు ఇచ్చిన మాట ప్రకారం క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్తూ చాలా బాగా చదువుకొని మన తల్లిదండ్రులకు మంచి పేరు తేవడం. ఇంకెప్పుడూ అబద్ధాలు ఆడకూడదు అని చెప్పడమే ఈ కథ యొక్క ఉద్దేశం విద్యార్థులు తప్పక చదవాల్సిన కథ.

ఇంకా ఈ కరీంనగర్ జిల్లా పెద్దలు రాసిన పిల్లల కథల పుస్తకంలో సోమరి, గాడిద, ఆలయం, పరుల కోసం, అనుభవ సారం, బుజ్జి పిట్ట మొదలైన కథల్లో చక్కటి నీతిని రచయితలు పిల్లలకి అర్థమయ్యే విధంగా చెప్పడం జరిగింది ఇందులో ప్రతి కథకు చక్కటి చిత్రాన్ని రచయితలు అందించారు ఆ చిత్రాన్ని చూడగానే కథ మొత్తం అర్థమయ్యే రీతిలో తీర్చిదిద్దారు. ఇందులోని మొత్తం కథల సంఖ్య 18. వేటికవే ప్రత్యేకం.

పిల్లల కోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితల రాసిన పెద్దలు రాసిన పిల్లల కథలు 10 సంకలనాలతో శ్రీ మణికొండ వేద కుమార్ ,చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ అకాడమి చైర్మన్ గా బాల చెలిమి ఆధ్వర్యంలో ప్రచురించడం అభినందనీయం.

ఇలాంటి పుస్తకాలు మరెన్నో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి ఆధ్వర్యంలో మరెన్నో రావాలని కోరుకుంటూ సంపాదకుల గారికి అభినందనలు శుభాకాంక్షలు

పుస్తకంలోని మొత్తం పేజీల సంఖ్య 60 పుస్తకం ముఖచిత్రం అందంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు పుస్తకం వెల 35 రూపాయలు

–బురిగల శ్రీజ
ఏడవ తరగతిజిల్లా పరిషత్
ఉన్నత పాఠశాల
రాయిలాపూర్, మండలం:
రామాయంపేట, మెదక్ జిల్లా
9441762105

కన్నీళ్ల వంతెన

రోజులన్నీ ఒకేలా వుండవు
అనుకోని సందర్భం లోంచి
నా కలల సామ్రాజ్యంలోకి
కన్నీళ్లు గేట్లు తెరుచుకున్నాయి.

ఇక్కడ ఉన్నదీ సైనికుడు
సంకల్పం తో యుద్ధం చేస్తూనే ఉన్నాడు.

గెలవడానికి ఒకింత ఓదార్పు
మరింత నేర్పు కాలం తో పోరాడాయి.

ఎన్ని ముచ్చట్లు కోల్పోయినా
ఎన్ని చీకట్లు కట్లు తెంచినా
బలాన్ని ధైర్యంగా ముందుకు
నడపటం తోనే యుద్ధం మొదలైంది .

వెన్నెల్ని చూడటం అలవాటైనపుడు
కన్నీళ్ల దృశ్యాల్ని చూడాలనుకోరు.

కష్టం ఆవలి ఒడ్డున
విజయం పిలుస్తోంది.
మరో శిఖరం అధిరోహించమంటోంది.

మనవి కానీ కాలాలు
మనల్ని కొన్ని తడుతుంటాయి .

దిగుల్ని దిగమింగుకుంటూ
సాధించిన విజయాలపై నిలబడి
ఆనందాన్ని రెపరెపలాడించడమే కదా జీవితం.

కన్నీళ్ల వంతెన దాటడం
నమ్మకాన్ని పునాదులు చేసుకుని గెలవడం
ఓడినా గెలిచినా దూసుకు పోవడం
లక్ష్యాన్ని చేధించటం
క్షణాల్ని మెరిపించే ఆకాంక్షే
జీవితాన్ని వెలిగిస్తూ నడిపిస్తుంది !

–గవిడి శ్రీనివాస్
7019278368,
9966550601

నిరుద్యోగినై సాగిపోతున్నా..!!

స్వాతంత్రపు జెండా నీడలో
పురుడు పోసుకున్న
ఎన్నో కొత్త జెండాలు...
జెండాలు మారితే
బ్రతుకులు మారుతాయన్నారు
ఏ జెండ నిరుద్యోగి పాలిట
చిరునవ్వుల సంతకం అయింది
చిరిగిన బ్రతుకులకు బరోసా అయింది
జెండాల నీడలో చిందులేసే
జీవితాలు బాగనేవున్నాయి
చదువులమ్మ నీడలో
సాగాలనే బ్రతుకులు సాగడం లేదు
నేడు నిరుద్యోగం బ్రతుకు మీద
శివ తాండవం చేస్తుంది
ఉద్యోగా

1979లో రాసిన కథ

ఆట

కథ



-డా॥నందిని సిధారెడ్డి
సెల్:9440381148

నియాన్‌లైట్ల తెల్లటి వెలుగులో వెన్నెల మరుగున పడిపోయింది. మిల్క్ బల్బులా కనిపించే నిండు చంద్రుడి వంక చూస్తేగానీ, అవి వెన్నెల రోజులని తెలీనట్టుంది. సిటీలో రోజూ వెన్నలే. అయినా– బాలిలాంటి వాళ్లకేం వెన్నెల? బాలి లేచి నాలుగు దిక్కులూ చూసి చేతులు పైకెత్తి అవులించి మళ్లా కూచున్నాడు.

అయోమయం 'బంగు'లా తిప్పుతుంది.

ఆలోచన్లు గుండుసూదుల్లా గుచ్చుకున్నాయి.

మిర్చీల్లేని మిర్చీ పొట్లాం కాయితం రెపరెపలాడ్తూ వొచ్చి బాలి మొహానికీ, పెదవికి అతుక్కుపోయినట్టు పడి జారిపోయింది.

'కాయితం' పొద్దున ఆ కాగితం కోసమే. అనవసరంగా నర్సితో తగూ పెట్టుకున్నాడు. బొగ్గులకుంటలో కాయితాలు వెతుకుతున్నాడు తను. దూరంగా పాత న్యూస్‌పూపర్ ఫుట్‌పాత్ మీద కొట్టుకుపోతుంది గాలికి. తనూ దాని వెంటే కొట్టుకుపోతున్నట్టు నడిచాడు. ఎక్కడ్నుంచో దెయ్యంలా వచ్చింది నర్సి. పెద్ద మిఠాయి దొరికినట్టు. రిలీజింగు నాడే సినిమాకు అందునా మ్యాట్నీకి టికెట్ దొరికినట్టు గభాలున పేపరు తీసేసుకుంది. అంతే తను రెచ్చిపోయి నర్సిని తోసేసి కాగితం లాగేసుకోబోతుంటే ఎవరో 'టై' కట్టుకున్నతను.

చీకటి వెలుగు.

''బాబూ.. అరే బాబూ..'' ఆశ్చర్యం!

ఎవరో టై కట్టుకున్నతను పిలుస్తున్నాడు.

అక్కడ.. యిక్కడా.. ఆఁ అతనిక్కడికెందుకొస్తడులే?

బాబూ, బీరు తెచ్చి పెడతావా?'' టై ఊగుతూ అడిగింది.

బాలి యింక ఆలోచన్లు చుట్టుచుట్టి పక్కకు పెట్టేశాడు. "ఓ యస్ సర్,''

"ఏం బీరు తెస్తావ్."

"సర్, మీరెద్దెమ్మంటే గద్దెస్త."

"ఈ షాపుల్లో ఏమేం దొరకుతాయ్?"

"సార్.." ఈసుగా చూసే జానీగాని వైపు అమాయకంగా చూస్తూ నెత్తి గోక్కోని, "కింగ్ ఫిషర్, ఈగలూ, సిల్వరూ, టాపూ ఆ.. సార్.. యూబీ."

"ఇంకా పేర్లన్నీ చదువక్కర్లేదు కాని, యూబి తెస్తవా మరి.."

"ఎన్ని సార్."

"ముందైతే ఓ రెండు బీర్లు పట్రా," అరవైనోటు తీసిచ్చింది టై.

''మూలకు పడేసిన నందిని భుజానికి తగిలించుకుని నడవబోయాడు బాలీ.

"ఇదిగో, బాబూ రెండ్రూపాయలవి తినడానికేవైనా పట్రా.. నేనిక్కడ ఓ కార్నర్‌కి కూచుంటా, వచ్చెయ్,'' టై ఊగుతూ నడిచింది.

బెల్లం మట్ట మీద పెట్టుకుని నాకుతూ పరిగెత్తేవాడిలా పరిగెతిబోయి మెల్లగానే నడిచాడు బాలి. జానీకి వాన్ని తన్ని ఆ బేరం లాక్కోవాలన్నంత కోపం వచ్చింది కానీ, తన్నుకోని రెండ్రోజులయినా కాందే మళ్లా...

అది, చదువులకి షూరిటీ యివ్వలేం కానీ, సరదాలకీ, తగాదాలకి పుట్టి నిల్లయిన యూనివర్సిటీ కాంపస్.

మనిషికి అన్నింటికన్న ఆరోగ్యమే మహాభాగ్యం కాబట్టి. విద్యార్థులకు చదువుల కన్నా ఆటలే ఆరోగ్యకరం కాబట్టి– ఆర్ట్స్ కాలేజి కవతల ఖాళీస్థలమంతా ప్లే గ్రౌండ్స్. అంతర్జాతీయంగా మన దేశ ఖ్యాతి ఏ రంగం నిలబెట్టలేకపోయినా, కనీసం క్రికెట్టయినా నిలబెడుతుందేమో నన్న ఆశతో, క్రికెట్ మీద కోట్లకు కోట్లు ఖర్చు పెట్టి, ఆఫీసులకు సెలవులిచ్చి, ఆకాశవాణుల్లో కామెంట్రీలు పెట్టి, జనాన్ని అలవాటు చేసి క్రికెట్ కళని ప్రోత్సహించే పవిత్ర భారతదేశంలో ఆ యూనివర్సిటీ కూడా ఒక భాగమే కనుక– క్రికెట్ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేయాలి కనుక– నాలుగు క్రికెట్ గ్రౌండ్స్‌నీ ఏర్పాటు చేసింది. ఇంకా బాస్కెట్‌బాల్‌కి, సెటిల్‌కి, టెన్సిస్‌కి.. ఆటకో కోట్ చొప్పున ఆ గ్రౌండ్ విలసిల్లుతోంది. పగలంతా బౌలింగ్‌లతో రన్స్‌తో బ్యాటింగ్‌తో ఆ గ్రౌండ్ అలసిపోతుంది. చీకటి పడుతూనే సేదదీర్చుకుంటుంది. మత్తుగా తాగేస్తుంది ప్లే గ్రౌండ్ కాస్త డ్రింక్స్ కాంపౌండ్‌లా పరిణతి చెందుతుంది.

ఆ గ్రౌండ్ ముందు పక్కకి విద్యార్థుల హాస్టల్స్ వున్నాయి. వెనకాతలే బార్‌షాపు, హోటల్సు, సెక్సు పుస్తకాల షాపులూ ఉన్నాయి.

ఆటలతో, చదువులతో ఇతర కలాపాలతో అలసిపోయిన హాస్టలన విద్యార్థులు. పక్కనే తార్నాకలో పెళ్లాలతో, ఆఫీసులతో ఇతర సమస్యలతో విసిగిపోయిన మూడం కెల గుమాస్తాలు– బ్రాకెట్లతో, ఫైటింగుల తో సర్వ రౌడీయిజాలతో పెట్రేగిపోయే గల్లలుంగీ విగ్రహాలు– ఇంకా కొందరు, అన్నిరకాల చాలామంది సాయంత్రాన్ని అనుభవించటానికి అక్కడికి చేర్తారు. ఆ గ్రౌండ్ చాలా విశాలమైంది కాబట్టి. ఆంధ్రదేశంలాగే అందర్నీ ఆదరించి అతిథి మర్యాదలు చేసే పానపూర్ణ. జట్లుజట్లుగా కళకళలాడుతూ పాటలతో, పద్యాలతో, చర్చలతో, తిట్లతో సందడిగా వుంది. జాతర్లా వుంటుంది. కానీ, బాలికే జాతర్లో గారడీ ఆటలో తీగ మీద నడిచే కుర్రాడిలాగానో, బలికోసం తీసుకెళ్లే గొర్రెపిల్లలాగానో వుంటుంది.

> "ఆఫీసులతో ఇతర సమస్యలతో విసిగిపోయిన మూడం కెల గుమాస్తాలు– బ్రాకెట్లతో, ఫైటింగుల తో సర్వ రౌడీయిజాలతో పెట్రేగి పోయే గల్లలుంగీ విగ్రహాలు– ఇంకా కొందరు, అన్నిరకాల చాలామంది సాయంత్రాన్ని అనుభవించటానికి అక్కడికి చేర్తారు"

మస్తాన్, జానీ, బాలీ వీళ్లు ముగ్గురూ అక్కడ డ్రింక్స్ సప్లయ్ చేస్తారు. అయిదింటి నుంచి విటుల కోసం చూసే వేశ్యల్లా ఎదురుచూస్తూనే వుంటారు. సప్లయ్ చేసినందుకు వీళ్లేమీ డిమాండ్ చేయరు. వాళ్ల దయా, ధర్మం. కానీ, ఖాళీ అయిన బాటిల్సే వాళ్లకు కూలీ.

ఒక బ్యాచీకి ఎవరు సప్లయ్ చేస్తే ఆ బ్యాచి తాగిన ఖాళీ బాటిల్సన్నీ అతనికే చెందాలనేది అక్కడి రూల్. రూలంటే మనదేశంలోలా రాయబడి అమలు జరగనిది కాదు. రాయబడకుండానే అమలు జరిగేది. బాలికి పదేళ్లంటాయ్. బాలి ఎప్పుడూ అదోలా కప్పిపెట్టుకున్నట్టు కనిపిస్తాడు. ముఖంలో ఏదో ఒక రూపాన అతని విషాదం వొలుకుతూ వుంటుంది. అందరితో చాలా సరదాగా, జాలీగా మాట్లాడుతాడు, అందర్నీ త్వరగా ఆకర్షించే గుణమేదో వాడిలో వుందని జానీగాడికి ఈసు. ఆ గుణాన్ని చూసే మస్తాన్ బాలి అంటే ఇష్టపడతాడు. కానీ, జానీగాడికి భయపడి వాడు చెప్పినట్టే చేస్తూ వాన్తోనే కలిసుంటాడు మస్తాన్.

కాలినొప్పి వల్ల పరిగెత్తలేకపోతున్నాడు బాలి. షాపులోంచి తిరిగి వస్తున్న బాలికి పరిగెత్తుతున్న మస్తాన్ ఎదురయ్యాడు.

"నీ కోసం టై గట్టుకున్నోడ్రాబె గాడ్దోర్లినట్టే వొర్లుతండు. జల్లి వోరబై."

"నువ్వెట్రా ఏమన్న తగిలిందా..."

"గండ్కె గదబై పోతాంది. ఆ జానీగాడేమొ దొర్లాగ కూసుంటడు. నేనేమో కూక్కోలె ఆడ్కీ ఈడ్కీ దిర్గాలె. కిస్మత్ బేకూఫ్ దడుక్కొచుకున్నం ఏం జేస్తంర బై.."

పూర్తిగా చీకటిపడింది.

ఐదారు బ్యాచ్‌లు సిటింగులో వున్నట్టున్నయ్.

మాటలే మామూలుగా చిదురు ముదురుగానే వున్నాయి. ఇంకా అందుకోలేదు.

"సార్, తీస్కచ్చిన సార్.." అంటూ బీరుసీసాలు, మిర్చీ పొట్లం, ఖార పొట్లం తీసిచ్చాడు. తిడుతున్నవాడల్లా బీరు సీసా ముట్టుకుని చూశాడు. అంతే, బీర్‌సీసాలాగే తనూ కూల్ అయిపోయాడు. బాలిని పేరూ అది అడిగి ఆప్యాయంగా పలకరించాడు. బీరు సీసాని ముద్దెట్టుకున్నాడు. బాలికి సంబంధించిన ఇతర విషయాలు అడుగుతున్నాడు. వాడు ఓపెనర్‌తో బీరుసీసాలు ఓపెన్ చేసినట్టే చాలా విషయాలు చెప్పాడు.

"బాలీ,"పిలుపు గాల్లో తేలింది. "అపుడే వస్త సార్," అని గాల్తో పరిగెత్తాడు.

సాధారణంగా హాస్టల్ స్టూడెంట్సు యితేనే తనని పేరుపెట్టి పిలుస్తారు. వాళ్లే నిత్య కస్టమర్లు కాబట్టి.

ఎవరో కాదు రాజన్‌సాబ్.

బాలి దృష్టిలో అమితాబ్‌బచన్ అతను. ఎప్పుడూ అతన్తోపాటు ముగ్గురో నల్గురో వస్తుంటారు. ఈసారి ఇద్దరే వచ్చారు. వాళ్లిద్దర్నీ అంతకు ముందెన్నడూ చూసినట్టు గుర్తు లేదు.

"అచ్చా బాలీ తీన్ బీర్ హెూనా."

"క్యా సాబ్ ముగ్గురున్నారు మూడు బీర్లేమయితయి."

రాజన్ ఒక చెయ్యి జేబులో పెట్టి ఒక చెయ్యితో కళ్లద్దాలు సవరిస్తున్నాడు.

'బాద్‌మే దేకింగే, పహేలతో తీన్ మంగావ్.. అచ్చా బాలీ మేరా బ్రాండ్ యాద్ హైనా..." రెండు పదిరూపాయల నోట్లు తీసిచ్చాడు.

"అవ్ సాబ్ అంత యాదుంది. మీ అడ్డ సుతం యాదుంది. గట్ల మరిస్తె ఎట్ల సాబ్ మీ అసొంటాళ్లను నిమిషంల పోస్త" అంటూ పరిగెత్తబోయేసరికి కాలునొప్పి ఇమ్మడైందేమో, పరుగుని నడకలోకి మార్చేశాడు.

చింతాకుతో రెండు కట్లు కట్టినా తగ్గలేదు.

తనని అయ్య దగ్గరికి తీస్కోని కాలు నిమురుతూ కట్టు కడతా వుంటే అయ్యలోనే అవ్వ కనిపించినట్లయింది. అవ్వ గుర్తుకొస్తూనే దుఃఖం కట్టలు తెంచుకుని వస్తుంది. హిమాయత్‌నగర్‌లో మార్వాడిసేట్ బంగ్లాకి సిమిటి టాప్ పోసిన్నాడు, నిచ్చెన మీంచి పడిన అవ్వ, ఆ తర్వాత రెండ్రోజులకి చనిపోయిన్నాడు ఎంత ఏడ్చాడో.. కనీసం చావుకైనా అన్నగాడు రాలేదు. ఎంత పాకెట్‌మారైనా అవ్వ గుర్తురాదా? వాడి తాగుడు, వాడి జులాయితనం అయ్యనీ, తన్నీ, అందర్నీ మరిపించేసింది.

తను వొచ్చిన పని మరచినట్లు బార్లు దాటేసి పోయాననీ గుర్తొచ్చి వెనక్కి మరలాడు బాలి.

రాజన్‌సాబ్ ఎప్పటి అడ్డా మీద లేడు. అక్కడెవరో సాయిబుల్లాంటివాళు తెలుగులో తాగుతున్నారు. రాజన్ తెలుగువాడిలాగే ఉన్నా ఉర్దూలోనే తాగుతాడు. బాలి అంతా వెతికాడు. ఎక్కడా కనిపించట్లేదు. జాతర్లో తండ్రి దొరకని పిల్లాడిలా తిరుగుతా వుంటే జానీగాడు తన్ని చూసుకుంటూ నవ్వుతాడు. టైం వేస్టయిపోతుంది. వచ్చే బేరాలన్నీ జానీగాడి పాలవుతాయి. ఆలోచిస్తూ, పిలవటానికి భయపడి కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు బాలి.

"అబే బే బాలీ," కేక కొట్టొచ్చినట్టుంది.

ఆ కేక రాజన్‌దే. వెళ్లాడు. అక్కడే రోడ్డుపక్క పూల్ కింది గొందిలో కూచున్నాడు. తెచ్చినవి వాళ్లకిచ్చేసి, "జల్లి వొస్త సార్," అంటూ వెదుక్కుంటూ తన అడ్డా మీదికొచ్చాశాడు.

ఎనిమిది దాటింది.

కాంపౌండంతా అసెంబ్లీ శీతకాల సమావేశాల్లా గులగుల్లాడ్తోంది.

సిటింగ్స్ కోసం జట్లు వస్తూనే వున్నాయ్.

బాలీ, మస్తాన్‌ల పుణ్యమా అని షాపుల్లోంచి సీసాలు జట్లుజట్లుగా లేచొస్తున్నాయ్.

పాపం, బాలి అందర్నీ సరిగా సముదాయించలేకపోతున్నాడు.

అందరూ పిలవటమే.

అందరూ తిట్టటమే.

ఈమధ్య ఎప్పుడూ ఈ రోజంత హడావుడి లేదు. దానికితోడు ఈరోజే కాలునొప్పి. మొన్న జానీగాడు తగువు పెట్టుకోకపోతే ఈ రోజంత అవస్థయేది కాదు. తనూ పరిగెత్తేవాడే మస్తాన్ లాగా. ఆ బాడుకావ్, అనవసరంగా తనమీద పడుతున్నాడీ మధ్య. శుక్రవారం నాడు ఆ దరిద్రం గ్రూప్ వచ్చింది. వాళ్లే సీసాలవీ తెచ్చుకున్నారు. పోయేటప్పుడు తనని పిలిచి ఆ ఖాళీ బాటిల్స్ తీసుకుపొమ్మన్నారు. వాళ్లు పిలవకపోతే అవి జానీ గాడికే వదిలేసేవాడు. పిలిచాడు కదా అని తెచ్చుకుంటే వాడు తగువుకొచ్చాడు. ఎంత సర్దిచెప్పినా లాభం లేకపో యింది. చివరకు బాటిల్స్ ఇస్తానన్నా ఊరుకొక వాటిని పగలేశాడు. కొన్ని ముక్కలు తన కాలికి గుచ్చి రక్తం చిమ్మాయి. ఆవేశంతో తనూ వాడి మీద పడ్డాడు. మస్తాన్గాడు, ఇంకెవరో వచ్చి ఇద్దర్నీ చల్లబరిచారు.

"అరేఁ ఈసారి బీరు అప్పుడంత సల్లగ లేదేంట్రా," మీసాలు గద్దించేయి.

తనకేం చెప్పాలో తోచలేదు.

అతనో లారీ డ్రైవర్. అంటే లారీని అమాంతం తలమీద పెట్టుకుని నడవగలిగేవాడు. అతను పట్టుబడితే ఉడుంలా వదలడని చాలామంది అంటారు. నల్లగా కాల యముడులాగే వుంటాడు కాబట్టి చాలామంది ప్రాణాలు తీసుకుని కేబిన్‌లో పెట్టుకున్నాడు. అతను లారీ నడపనప్పుడల్లా తాగుతాడు. అతన్ని చూస్తే చాలా భయం బాలికి. తంతాడేమోనని భయంగా ఉంటుంది. వాడి చేతిలో తనో బంది అయినట్టు కుంచించుకుపోతాడు.

"బాలి," తెల్ల టై మళ్లా పిలిచింది.

సమయం, సాకూ దొరికిందని సంతోషపడ్తూ, "అబ్బీ అతా సాబ్," అని అటువేపు నడిచాడు.

"క్వార్టర్ విస్కీ," మత్తుగా చెప్పాడు. అప్పటికే రెండు బీరు బాటిల్స్ ఖాళీ చేశాడు. మళ్లా విస్కీ!

"విస్కీ ఎట్లా తాగుతరు సార్,"

"అరేయ్, నీ పేరేంది, బా..బాలీ, కె.యస్.ఐ. కంపెనీ మేనేజర్ చెప్పాక నీకెందుకు పో. వాంటెడ్ క్వార్టర్ విస్కీ," ఈసారి యాభయి నోటు తీసిచ్చాడు.

టై ముద్దుగానే వుంటుంది.

ఇదీ అంటూ ఖచ్చితంగా చెప్పలేని ఏదో భావం ఆ మొహంలో ఉంటుంది. ఆ కళ్లు ఆ ఒళ్లు చూస్తుంటే ఎందుకో సిగ్గుపడుతున్నట్టు కుంచించుకుపోతాయి. అందుకే– బార్స్‌లో తాగలేక ఇక్కడికొచ్చాడే మోనని అనుమానంగా వుంది బాలికి.

"పో. త్వరగా పట్రా పో," అంటూ ఖాళీ బాటిల్ తీసుకుని పదే పదే ముద్దు పెట్టుకున్నాడు.

బాలి వేళతా వెళతా రాజన్ దగ్గంకెళ్లి, "కుచ్ హెనా సాబ్," అడిగాడు.

"అచ్చా, బాలీ, నా పేర్జెప్పి మూడు బీర్లు తీస్కరా," కళ్లద్దాల్ని తీసి తుడిచి పెట్టుకుంటూ అన్నాడు.

"ఇయ్యరు సాబ్,"

"ముందు నువ్ పొయ్యడుగు."

"లేద్సార్"

పక్కతను ఇరవై నోటు తీసి, "మూడు తీస్కరా పో," అన్నాడు.

"నక్కో కైలాస్ ఉనో దేతా,"

ఈలోగా బాలీ డబ్బులు తీసుకుని వెళ్లిపోయాడు.

వీళ్ల మధ్య మెదలడం కంటే గాల్లో గడ మీద నడవడమే హాయిగా వుంటుందనిపిస్తుంది బాలికి.

అయ్యలాగే తనూ ఓ దగ్గర చెప్పులు కుట్టుకుంటూ కూచున్నా పోయ్యేది?

పొయ్యేది ఎప్పుడో?

పొయ్యేది– పొయ్యేది.

వండటానికి పొయ్యేది?

అవ్వ పోయాక పొయ్యేసరికి వంట మొదలెట్టిన రోజున తన చెయ్యి కాల్చుకున్నాడు.

చెయ్యే కాదు ఆనాడే అంతా కాల్చుకున్నా పొయ్యేది.

"సేర్‌జీ మూడు టాప్, క్వాటర్ విస్కీ,"

మొదట్లో బీరు తాగాలనిపించే దెవుడయినా. అడుగు చుక్కలయినా వుంచరు లక్కీ డ్రాప్స్ అంటూ చివరంటా పిలుస్తారు. బీరు, విస్కీ ఎలాగూ తాగలేదు తను. పొద్దుట్నుంచీ సంకటయినా తాగలేదు.

తెల్ల టైకి విస్కీ ఇచ్చేసి రాజన్‌వైపు బయల్దేరాడు.

పదకొండవుతోంది. ఎక్కడి వాళ్ల కక్డ వెళ్లిపోతున్నారు. జనం పల్చబడింది. మొదట్లా బోసిపోయినట్లుందా గ్రౌండ్. ఇంటికెళ్లి పోవాలి. అయ్య తాగి టాప్‌గేర్‌లో వుండుంటాడు

"అరేయ్ బేకూఫ్ ఇది టాపేనా బే," రాజన్ కళ్లద్దాల చాటు నుంచి అరిచాడు. గుక్కలో బీరు నేల మీద ఊసాడు, తిడుతూ.

"టాపే సార్," బాలి జవాబు.

మళ్లా ఓ గుక్క పోసుకున్నాడు. నోట్లోంచి టాప్ గుక్క కడుపులోకి వెళ్లటం లేదు. "ఇది వాపస్ ఇచ్చి టాప్ తీస్కరా పో.'

''ఓపెన్ చేసినంక వాపస్ తీస్కోరు సార్, గుమ్మతుగ మాట్లాడ్తం డ్రు." "మరిదేం చెయ్‌మంటవ్ బే."

సరదాగా, బాలికి రాజన్ దగ్గర వుండే చనువుకొద్దీ కొంచెం సాహసించి అన్నాడు. "తాగేసెయండ్రి సార్ బాగనే వుంటది."

బాలి సమాధానానికి గుక్క రెచ్చిపోయింది. అది బరస్ట్ అయినట్టు కోపంగా వచ్చి బాలి మొహమ్మీద పడింది. బాలి మొహమంతా బీరుతో తడిసిపోయింది. బిందువులు బిందువులుగా మొహం మీంచి జారుతోంది. తుడుచుకోటానికి వాడి దగ్గర చేతులు తప్ప కర్చీఫ్ లేదు. రెండు చుక్కలు నాలుక మీద కూడా పడినయ్. అసహ్యం, జుగుప్స వేసింది.

రాజన్ అసహ్యంగా కనిపించాడు.

అతని కళ్లద్దాలు, అతని బట్టలు, అతని కాలేజీ, అతని సంస్కారం అంతా అసహ్యంగా కనిపించాయి బాలికి.

> వాళ్ల సుఖాల కోసం, వాళ్ల భోగాల కోసం, వాళ్ల అవసరాలు సర్థటం కోసం తను జీవిస్తున్నపుడు ఎలా తప్పుతాయి?

పక్కన వున్న యిద్దరూ తమకేమీ పట్టనట్లు సీసాలు నోట్లో పెట్టుకొని చీకుతున్నారు.

పో, రాస్కెల్ ఇంకెందుకు నిల్చొన్నవీడ, సువ్వర్‌కె బచ్చ."

బాలికి రాజన్‌ని బూతులు తిట్టాలనిపించింది.

పట్టుకుని కుక్కకి మల్లే చియ్యలు చియ్యలు పీక్కు తినాలనిపించింది.

మెల్లగా కదిలిపోతున్న బాలికి పక్కవాడడిగిన మాట వినిపించింది.

"ఏరా రాజూ, పాపమా పోరణ్ణి అన్యాయంగ ఇజ్జేస్తివి గద."

"నో. నీకు తెల్వది కైలాసం. ఇంతో అంతో తాగినం కద. దీనికి అర్థం వుండాల్నన్నా, కాస్తంత మజా చెయ్యాల్నన్నా ఇట్లాంటి ఒకటో రెండో జేస్తేగానీ, ఎంజాయ్ అవదు. జస్టె ఫన్. సరదా."

"ఏడుస్తున్న బాలికి పిలుపులు తప్పలేదు. ఎందుకు తప్పుతాయి?

వాళ్ల సుఖాల కోసం, వాళ్ల భోగాల కోసం, వాళ్ల అవసరాలు సర్థటం కోసం తను జీవిస్తున్నపుడు ఎలా తప్పుతాయి?

"బాలిగా," తెల్ల టై అరచింది.

బాలి వెళ్లి నించున్నా కన్నీళ్లు కప్పుకోలేకపోతున్నాడు.

తెల్ల టై విస్కీ బాటిల్‌లాగే బాలిని దగ్గరకు తీసుకుంది.

అతను బాలి మొహమ్మీదంతా తన కర్చీఫ్‌తో తుడిచాడు.

బాలి బావురుమని జరిగిందంతా చెప్పుకున్నాడు.

అతను విస్కీలా నల్లబడిపోయాడు.

బాలి మొహాన్ని ఆప్యాయంగా నిమిరాడు. గుండెకు హత్తుకున్నాడు.

బాలికి అవ్వ గుర్తొచ్చింది.

అయ్య గుర్తొచ్చాడు.

మనసులోనే తెల్ల టైకి మొక్కుకున్నాడు.

దేవుడి పాదాల ముందు కొబ్బరికాయ తల బాదుతున్నట్టు బాలి 'టై' ముందు బాదుకున్నాడు.

టై ఓదార్చింది. సానుభూతి పద్యాలు నడిచాయి.

మిర్చీ తినమని యిచ్చి బలవంతంగా తినిపించాడతను.

బాలి కొంచెం కొంచెం మామూలు స్థితికి వచ్చాడు.

"మేం పోతున్నం రా బై,'' మస్తాన్‌గాడు వెళ్లిపోయాడు.

బాలి ఒక్కసారి లేచి చుట్టూ చూశాడు. రాజన్ వాళ్ల బ్యాచి తప్ప ఎవరూ లేరు.

ఆర్.ఆర్. లాబ్స్ వెళ్లే రోడ్డు మీద నుంచి లారీ వెడుతోంది. మత్తుగా, గుబురుగా కమ్ముకున్న చెట్ల మీంచి ఏదో కూస్తుంది, కొత్తగా.

"బాలీ కూచొరాదుర," టై సన్నగా కూస్తోంది.

"ఇపుడే వొస్తాన్ సార్," అని తన అడ్డా మీదికి వచ్చి ఖాళీ బాటిల్స్ కూడేసిన సంచి తెచ్చుకున్నాడు. మిగిలిన ఒకటీ అరా ఏరుకుని, ఇట్నుంచే ఇంటికెళ్లచ్చని?

తెల్ల టై అతను ఎదురుగా కూచోబెట్టుకుని మాటలు చెబుతుంటే ఏదో ఆత్మీయత కలుక్కుమని తొంగి చూస్తుంది బాలికి.

విస్కీ బాటిల్ ఇంకా కొంచెం మిగిలింది.

అతనికొక్కడా ఇదీ అని చెప్పలేనిదే దో మిగిలినట్టుంది.

బాలి అతన్ని తండ్రిలా, తల్లిలా, దేవుడిలా, యింకా యింకా దేంతో సరిపెట్టుకోవాలో తేలక ఆకాశంకేసి చూస్తున్నాడు.

తెల్ల టై చేతులు బాలి మొహాన్ని దగ్గరికి తీసుకున్నాయి.

చేతులు కదలటం ప్రారంభించాయి.

బాలికి మొదట ఆశ్చర్యంగా వుంది. తరువాత అయోమయంగా వుంది. పిదప యింకా దశలు మారింది. భయం మొదలయింది.

చేతులు ఇనుప పట్కారు రెక్కల్లా బాలి నిక్కర్‌లోకి వెళ్లాయి.

తొడల్ని నలిపేస్తున్నాయ్.

బాలికి చచ్చిపోతానేమోనని పించి తన్నుకోవటం మొదలెట్టాడు.

టై పిచ్చిగా రక్కుతూ నిక్కర్ పీకేసింది.

రోకలికి మల్లే గుండె కొట్టుకోవటం బాలికి. బాలికి అర్థం కాని ఆవేశం వచ్చింది. శవం మీద పడ్డ నక్కలా, దొంగల మీద పడ్డ పోలీసు కుక్కలా, గద్దలా రక్కాలనిపించింది. చంపాల నిపించింది. తెల్లదనాన్ని, టైని. కానీ– బాలి ఏం చేయగల్డు పాపం. ఊపిరే ఆడకుండా అయింది. ●

కడిగిన ముత్యం

ఉరుకుల పరుగుల యుక్త వయస్సు
మనస్సున కోరికల సీతాకోకచిలుకలు
కల్మషం లేని మనస్సు
లోకమంతా రంగుల ప్రపంచం!

ఏది చూసిన దృశ్యమాలికనే
ఆకాశాన ఎగురుతున్న ఆశలు
అన్నీ అందుకోవాలి అనే ఊసులు
స్వర్గాన్ని అరచేతిలో చూస్తున్న వైనం!

బలమైన కోరికతో మోహానికి లోనయి
బలహీనమైన క్షణంలో మోసపోయి
తెలిసిన క్షణం మనసంతా అల్లకల్లోలం
వేదనా సెగలు ఆవేదనా భగభగలు!

కన్నీటి దారలు
కన్న వారికి చెప్పుకోలేని బాధలు
ఆగని కన్నీళ్లు
తుడుచుకోవాలన్న ధ్యాసే లేదు!

యవ్వనంలో తడబడితే
తప్పు అడుగే కదా
లోకానికి తెలిస్తే లోకువ
తప్పు మోయాలా? కడిగేయాలా?

తనువంతా తడుస్తూ
తనివి తీరా ఏడుస్తూ
కనిపించకుండా కన్నీరు
వరంలా కురుస్తున్న వర్షం!

ఆవేదనలోనుండి ఆలోచనల్లోకి
తప్పు అడుగును సరిదిద్దుకోవాలని
చేసిన పాపాన్ని కడిగేసుకోవాలని
కడిగిన ముత్యంలా ముందుకెళ్ళాలని!

-జగ్గయ్య.జి
9849525802

మాతృభూమి

నన్ను కన్న
నా మాతృమూర్తికి వందనాలు
మమ్ముల కన్న
మా భరతమాతకు పాదాభివందనాలు
ఉత్తరాన మంచు దుబ్బట్లతో
మెరుస్తుంది కాశ్మీరం
దక్షిణాన హరిత హారములతో
వెల్గుతుంది కన్యాకుమారి
దేశంలోని గుడిలలో
దేవత మూర్తులకు సువర్ణమయం
పాడి పంటలకు మా భూములు
అన్నపూర్ణం
దేశ సరిహద్దులో వీర సిపాయిల రక్షణ
కవచం
కోట్ల భారతీయులకు కంటినిండా
నిద్రాసుఖం
ఖురాన్, బైబిల్, భగవద్గీతలు
వేరైనా దైవం ఒక్కడే
రామాయణం, భారతం, భాగవతలు
కావాలి అందరికి ఆదర్శం
అరవై నాలుగు కళలందు
భారతీయులు గొప్ప నిష్ణాతులు
సాహిత్య సంగీత రంగల్లో మాకు లేరు
పోటీ
అన్ని రంగాల్లో యువతకు
పెద్దపీట వేయ్యాలి
దేశ సంపదాలకై కృషి చెయ్యాలి
ప్రతి మనిషి
కట్టు బొట్టులను మరిచి
యువత
విదేశీయులుగా మారుతున్నారు
మన సాంప్రదాయలకు
హారతి పడుతున్నారు పరదేశస్తులు
ఉచిత పథకాలకు తిలోదకాలివ్వాలి
దేశ నేతలు
స్వయం కృషితో
పోటీపడి నెగ్గాలి పౌరులు.

- నేతాజీ
98496 36389

నిజాలు....

కనిపించిన దానికల్లా ఆశ పడకు,
అది నిన్ను ఆనందం నుండి అఘాదంలో పడేస్తుంది, అందుకే
దురాశ దుఃఖానికి హేతు వంటారు విజ్ఞులు
.
సామాన్యంగా తాళం తనను తీయడానికి పగలగొట్టడమైనా భరిస్తుంది.
కాని, వేరే తాళం చెవితో తెరుచు కోడానికి ససేమిరా ఒప్పు కోదు తెలుసా!,
అలాగే నీతి మంతులు ఎంతటి ఇబ్బంధులనైనా భరిస్తారు.
కాని తమ వ్యక్తిత్వాన్ని మార్చు కొనడానికి మాత్రం
ససేమిరా ఒప్పుకోరు తెలుసా!.,

-దారం గంగాధర్
సెల్:9848384777

మణిపూసలు

చెలిమి కాంచదు ఎపుడు
కలిమి లేములు నెపుడు
కొమ్మ చిగురు తొడిగేను
కోకిల పాడినప్పుడు!

లోకమంత మాయగాళ్లు
గుడి, లింగం మింగెటోళ్లు
కనురెప్ప వాల్చినంత
నీ నీడను దోచెటోళ్లు!

నాయకులొస్తున్నరు
హామీల నిస్తున్నరు
గెలిపించిన తర్వాత
అన్నీ మరుస్తున్నరు!

వల్లిస్తుంటరు గొప్పలు
అవి వాగ్దానపు కుప్పలు
అవసరం తీరిందా
పెద్దారెన్నో తిప్పలు!

అనుభూతుల ఆనవాళ్ళు
శాంతి పుష్పాలై రాలు
ఎడారైన ఎదలోపల
కురిసెను పన్నీటి జల్లు!

ఆమెను చూసిన చాలు
భావము కవితయి వాలు
హృదయ సదనములోన
విరుయునోయి కుసుమాలు!

బురదలోనె విరుయు కలువ
మేధతోనె పెరుగు విలువ
ఎంత పదును పెడితె యంత
వజ్రమునకు వచ్చు విలువ!

గుర్తింపును లేని శ్రమ
గుర్తించలేని ప్రేమ
ఎంతకాలం సాగినను
హృథాయేను పరిశ్రమ

-యన్.వి.రఘువీర్ ప్రతాప్
సెల్:9440551552.

నాటి తరం వారి కథలు నేటి తరానికి

కథల వంతెన

1982లో రాసిన కథ

వేటగాడు

కథ



-సాధనాల వెంకటస్వామి నాయుడు
సెల్:8555838516

వెంకట్రాజు వీధి అరుగుమీద వాలు కుర్చీలో కూర్చుని పేపర్ చదువుతున్నాడు. 'బావ్.. వెంకట్రాజు బావ్, అడవి పందులు సెలగ సేల్ని దున్నేత్తున్నాయ్" అన్నాడు దగ్గర్లో వున్న పల్లె నుంచి వచ్చిన రాములు.

ఆ మాట వినగానే స్ప్రింగ్‌లా లేచి కూర్చున్నాడు వెంకట్రావ్.

''పందులా? ఏ వేళప్పుడు దిగుతున్నాయ్? ఎక్సైట్‌మెంట్ కప్పిపుచ్చుకుంటూ హుందాగా అడిగాడు వెంకట్రాజు.

"ఒక్కోసారి ఎలుతురుండగానే వొచ్చేత్తున్నాయి. ఒక్కోసారి తెల్లార గట్ల దిగుతున్నాయి. ఆటికి అప్పుడు, యిప్పుడూ అని లేదండి'' అని చెప్పాడు రాములు.

"మందలు మందలుగా వస్తున్నాయా? విడివిడిగా వస్తున్నాయా?"

అలాగా, యిలాగా వొత్తున్నాయి బావ్. ఆ మద్దిన పిల్లల పందికూడా ఒకటి దిగింది బావ్.

"ఎన్ని రోజుల్నుంచి వస్తున్నాయ్?"

"ఎక్కడ బావ్. సానా రోజుల్నుంచి."

"మరిన్నాళ్ళూ ఏం జేసావ్?" నా దగ్గర తుపాకీ వుందని నీ

జన రంజక కవిత్వం జాతికి అవసరం

-జన రంజక కవి ప్రతిభా పురస్కారాల సభలో వక్తలు

జన రంజక కవిత్వం భారత జాతికి నేడు చాలా అవసరం అని వక్తలు పేర్కొన్నారు. రావి రంగారావు సాహిత్య పీఠం గుంటూరులో బుధవారం సాయంత్రం బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదిక మీద రావి రంగారావు సాహిత్య పీఠం నిర్వహించిన "జన రంజక కవి ప్రతిభా పురస్కారాల సభ''లో పలువురు సాహితీవేత్తలు పాల్గొని ప్రసంగించారు. ఆధునికత పెరిగిపోయిన నేటి సంక్లిష్ట దేశంలో పెరిగిపోతున్న నూతన సమస్యల పరిష్కారం కోసం ప్రజల్ని చైతన్య పరిచే కవిత్వం చాలా అవసరం అని వారు తెలిపారు. స్పష్టంగా సూటిగా గంభీరంగా భావయుక్తంగా నిరాడంబర శైలిలో బాగా అర్థం అయ్యే కవిత్వం రాసే కవులకు పురస్కారాలు అందజేస్తున్నట్లు చెప్పారు, జన రంజక కవిత్వం వలన ప్రజాస్వామ్యం వికాస మార్గంలో పయనిస్తుందని వారు అన్నారు. సభకు సారస్వత కళానిధి వెలువోలు నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. దేవాలయ పాలక మండలి అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. పీఠం సంస్థాపకులు డా. రావి రంగారావు మాట్లాడుతూ ఏటేటా కవిత్వ ప్రక్రియ ఏదైనా పుస్తకాలు ఆహ్వానించి జన రంజక శైలిలో రాసిన పుస్తకాలను ఎంపిక చేసి కవులకు పురస్కారాలు అందిస్తున్నట్లు తెలియజేసారు. ముఖ్య అతిథిగా గుంటూరు ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ మొండెపు ప్రసాద్ ప్రసంగిస్తూ ఉత్తమ సాహిత్య ప్రచారం చాలా అవసరం అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జి.వి. పూర్ణచంద్ ప్రసంగిస్తూ సంస్థ ఇపుడు పదో ఏడు పురస్కారాలు ఇస్తున్నదని, నిరంతరాయంగా అయిదారుగురు కవుల్ని ఎంపిక చేసి పురస్కారాలు అందజేస్తున్న రావి రంగారావు సాహిత్య పీఠం కృషిని, రావి రంగారావు నిబద్ధతను కొనియాడారు. "పద్య ప్రభాతం" కవయిత్రి పాలపర్తి హవీలా (ఖమ్మం), "మొలగొలుకు చేను" కవి పేరిసెట్ల శివకుమార్ (నెల్లూరు), "కలల రంగు" కవి రహీమొద్దిన్ (మహబూబాబాద్), "నీటి గింజల పంట" కవి కంచరాన భుజంగరావు (శ్రీకాకుళం), "రాగుల సీమ" కవి యామలపల్లి నరసిరెడ్డి (శ్రీ సత్య సాయి జిల్లా), "కావ్య విపంచి" కవి డా. దేవరపల్లి ప్రభుదాస్ (గుంటూరు) పీఠం పక్షాన అతిథుల చేతుల మీదుగా పూల మాలలతో, శాలువాలతో, ప్రశంసాపత్ర జ్ఞాపికలతో , రెండేసి వేల రూపాయల నగదు బహుమతితో సత్కారాలు అందుకున్నారు. సన్మాన కార్యక్రమాన్ని పాణిరావు యర్రగుంట్ల, డా. మైలవరపు లలితకుమారి నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పింగళి భాగ్యలక్ష్మి, కొల్లూరి నాగేంద్రం, రావి రంగారావు సాహిత్య పీఠం కన్వీనర్ నర్రా ప్రభావతి, డైరెక్టర్ డా. రావి అరుణ మొదలైనవారు పాల్గొన్నారు.



సనాతనం
అధునాతనం
కాలమేదని కాదు ముఖ్యం మనిషితనం.
-పట్నాల ఈశ్వరరావు విజయనగరం

మమకారం
సహకారం
పెద్దరికానికి భగవంతుడు
ప్రేమగా ఇచ్చిన అలంకారం
-ఉపద్రష్ట సుబ్బలక్ష్మి హైదరాబాద్

ఫలం
అలం
భక్తితో ఏదైనా సమర్పించు కనీసం
జలం
-పీకేదుర్గప్రసాద్ విశాఖపట్టణం

తరులు
గిరులు
సైన్యంలా నిలిచి గుండెధైర్యాన్ని పెంచే
సిరులు
-భమిడిపాటి, హైదరాబాద్.

కళ్ళు
పళ్ళు
దుఃఖంలో రెండే, ఆనందానికి
ముప్పైరెండు వాకిళ్లు
-పి.లక్ష్మీప్రసన్న, కాకినాడ.

వనం
ధనం
దండిగా ఉన్న పశుపక్షులు ఇబ్బడి
ముబ్బడిగా జనం !
-డా॥పట్నం శేషాద్రి,హైదరాబాద్.

దేవదాయం
ధర్మదాయం
భక్తుడిని భగవంతునికి సన్నిహితం
చేయడం సంప్రదాయం
-గంగరాజు పద్మజ మలకపేట హైదరాబాదు

సదనము
కథనము
రచయితకు భావనలో స్వేచ్ఛను
అందించగలదు మథనము
-ఎం .వి .ఉమాదేవి, బాసర ,నెల్లూరు

రామాయణం
ప్రేమాయణం!
పాశ్చాత్యప్రభావంతో సాగుతూంది
కొండొకచో హేయమైన కామాయణం!
-ఎన్.ఆర్.తపస్వి, చెన్నై

అదృష్టవంతుడు
దురదృష్టవంతుడు
ముందడుగు వేసిన వాడే
అసలైన సాహసవంతుడు
-డాక్టర్ వైవీ సుబ్రహ్మణ్యం, హైదరాబాద్

యోగం
భోగం
వ్యవహారం విచ్చలవిడి అయితే
పర్యవసానం రోగం.
-చెన్నూరి సుదర్శన్, హైద్రాబాదు

బేరం
సారం
వ్యాపారానికి అద్భుతం
జీవనగమనానికి కేవలం అపచారం !
-కె.కె.తాయారు, మదనపల్లి

సతి
పరపతి
మనిషి అజాగ్రత్తకు పర్యవసానం
బ్రతుకు అధోగతి!
-జంజం కోదండ రామయ్య జమ్మిపాశెం

కేరింతలు
తుళ్ళింతలు
చిన్నారుల సందడితో సంతోషం
అవుతుంది వెయ్యింతలు
-కాళీపట్నపు శారద హైదరాబాదు

చిరాకు
పరాకు
జీవితలత అవి లేకుంటేనే తొడుగుతుంది
మారాకు
-సూర్యదేవర రవికుమార్ గుంటూరు

కవనం
దవనం
సుగంధాలు విరబూసే కావ్యగానంతో
సుందరం సుమవనం!
-యన్.కే. నాగేశ్వరరావు పెనుగొండ.

చెడగొడుతుంది
పగబడుతుంది
నడమంత్రపు సిరి చివరికి
బంధాలను విడగొడుతుంది
-శేష శైలజ (శైలి), విశాఖపట్నం

రథం
పథం
సుగమమైతే రాజోత్సవం ఏదైనా
ప్రగతికి సవిధం
-యు.వి.రత్నం, ఒంగోలు

రాజ్యాంగం
మంత్రాంగం
ప్రభుత్వం నడపడానికి కావాలి
మేధావుల యంత్రాంగం
-వాడ్రేవు కామేశ్వరి, రాజమండ్రి

నేత
మేత
రాత మారదు,
జరిగేది పంపిణీలో కోత..
-ఆచంటి శ్రీనివాసరావు, తెనాలి.

ధూమపానం
మద్యపానం
దశాబ్దాల వ్యసనంతో గాలిలో
కలిసిపోవు ప్రాణం!
-పంతుల లలిత(నీలాంజన) విశాఖపట్నం

అమలం
విమలం
సుక్షేత్రాలకు సాగునీరు అందిస్తే
కాదా సస్యశ్యామలం
-గడ్డం దేవీప్రసాద్, బెంగళూరు.

తరం
అంతరం
"ఉభయకుశలోపరి" అంటే అర్థం
తెలియని నవతరం!
-గోగినేని రత్నాకరరావు తెనాలి.

ఘోషణం
భాషణం
క్లుప్తత స్పష్టత నిబద్ధత సత్యసంధత
వాగ్భూషణం **-అచ్యుతుని రాజ్యశ్రీ** హైదరాబాద్

సన్నిధి పెన్నిధి
అనంతుడూ,నిర్గుణుడయిన నిరాకారునకై
తన్మయత్వం అంతస్సన్నిధి
-విత్తనాల విజయ కుమార్, హైదరాబాద్

అక్షర సైనికులు

చీకట్లో వెలుగు కాగడాలు
నిత్యం ఉప్పొంగే సాగరాలు
ఎగిసి పడే ఆలోచనల అలలు.

మనసు నిండా వేదనలు
కలల ప్రపంచ ఆలాపనలు
దివిటీలై వెలిగే మానవత్వ మార్గాలు.

మేల్కొల్పు బాటలో
నిత్యం పరితపించే హృదయాలు
మనసులో భావాల సంఘర్షణలు

అగ్ని జ్వాలల్లో మెరిసే కలాలు
మంటలు పుట్టించే అక్షరాలు
వెంటాడే సాహిత్యంతో కలాలు
నడిపించే కవిత్వంతో కలాలు.

రాజీపడని కలాలు
రాజీలేని పోరాట ఊపిరులు
కాలంతో పోటీపడే కవిత్వం
ఆకాశంతో నిత్య పోరాటం కవిత్వం .

జన అక్షర ఉషస్సు
మదనపడే అలజడుల మనస్సు
గాయపడిన అక్షరాలు
చేసేటి తపస్సు.

ఎగిరే సాహిత్య జెండాలు
సామాన్యుని కలల సాకారాలు
మట్టిని వీడని నిబద్ధతలు .

కలల పట్టుదల కలల సాధన
కలల సంఘర్షణ
నిద్దుర పట్టని
చీకటి రాత్రుల నేస్తాలు.

ఆలోచనలై సాగే
కలల కాపలాదారులు
అక్షర సైనికులు
కవులు

-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

అమ్మ ఓ కొవ్వొత్తి

కొవ్వొత్తెలిగేందుకు
ఉండాలి దారం..
మనిషి ఎదిగేందుకు
అమ్మే ఆధారం.

కరెంటొచ్చాక
కొవ్వొత్తినార్పేసినట్లు,
దబ్బొచ్చాక
అమ్మని వదిలేశారు.

నిశిని పారద్రోలిన
కొవ్వొత్తిలా,
నాలో ఉన్న నిరాశని
తరిమింది అమ్మ.

కొవ్వొత్తిని
చూస్తూ ఉహించుకోకు
అమ్మ అనురాగాన్ని
కూడా చూడు

మదిన వెతలు
విడువడుఅమ్మ ప్రేమతో
సంకల్పం తో కొవ్వొత్తి
వెలుగు నింపు.

ఎదురుచూస్తూంది
బిడ్డల రాకకై
కొవ్వొత్తిలా కరిగిపోయే
అమ్మప్రాణం.
అమ్మ శ్రమించి
బిడ్డ ఆకలి తీర్చె
కొవ్వొత్తి కరిగి
వెలుగునిచ్చె.

కొవ్వొత్తి చిన్నదే
రాత్రిని పారదోలు
చిన్న సమస్యే
నిబ్బరంతో చూపుఅమ్మ

కొవ్వొత్తి తలపై జ్యోతి
చీకటి తొలచు
అమ్మ నొసట బొట్టు
వెలుగే బతుకు.

అమ్మ తనను తాను
అర్పించుకును
కుటుంబానికి అదే
కొవ్వొత్తిలా

-తుమ్మా రాజా
8099918883

బంజారా నానీ

ఇప్పపూల అందం
నిజంగా ఇంపు
కాని అవి వెదజల్లేది
సారా కంపు

-డా॥ సూర్యాధనంజయ్
సెల్:9849104187

నడుప్ ముందుకు

నడుప్ బిడ్డా ముందుకు
భయమెందుకు, బాదేందుకు
కారితే కారినయిలే కండ్ల నీళ్లు
అయిగూడా మంచియేలే
చూపును తేటగజేస్తయిలే
గుండె బరువు దిగిపోతదిలే
ధైర్యం మాత్రం జారిపోనీయకు
నడక మాత్రం ఆగిపోనీయకు
నులిమిన కండ్లను తెరుచుకో
వంచిన తల ఎత్తుకో
నిన్ను నువ్వు నమ్ముకో
చుట్టూ చూపు సారించుకో
బాటెమ్మట రాళ్ళుంటయి
కస్సున గుచ్చే ముళ్ళుంటయి
గుంతలూ గతుకులే దారంతా
పోరాడే పావులమే మనమంతా
బతుకంటెనే ఒక పోరాటాం
సాగిపోతనే ఉండాలే ఆగకుండా
గుండెల నిండా ఊపిరి తియ్యి
నీ పయనమాగక సాగనియ్యి
నా చాతనైన సాయం చేస్తా
వెన్ను తట్టి ముందుకు తోస్తా
నడుప్ బిడ్డా ముందుకు
భయమెందుకు,
బాధ ఎందుకు!
-కవియాన్ (కవిత బేతి), హైదరాబాద్

మమతలకర్థం

మమతలకర్థం తెలిసిన తరం
బాంధవ్యపు బంధాలను
భుజస్కంధాలపై మోసిన తరం.

మానవత్వానికి అర్థం తెలుపుతూ
వ్యవస్థలో మిగిలిన అనామికకు
ఓదార్పుగా చేసిన చేయూత
అనిర్వచనీయం.

అపరిచితులకైనా ఆపదలో
కూసింత సాయం చేయడం
నాన్న తరానికి చెందిన అభయహస్తం

సాంత్వనగా నిల్చిన సందర్భం
ఈ విశాలప్రపంచం తనకో
నమ్మకపు కోవెలగా నిలుస్తుంది.

సామాజిక అసమానతలు
అసాంఘిక విషయాలకు
కుంగిపోవుడు కాదంటూ
స్వేచ్ఛా బాటన కపోతమై
సాగిపోవు ఆకాశపు అంచులు దాటి
విజ్ఞాన విపంచికలా

- దార స్నేహలత, గోదావరిఖని

భూరి హృదయం

మార్తాండుని మండుటెండల ప్రభావం
అగ్నిగుండమే అయ్యింది అవని మొత్తం
ఎండదెబ్బకందరు ఇంటికే పరిమితం
రహదారిపై కానరాదు నర సంచారం.

నడిరోడ్డుపై నడవ లేక లేత పాదం
అల్లాడి పోతున్నది చిన్నారి ప్రాణం
చూసి తల్లడిల్లింది సాటి హృదయం
లేకున్నా తనకేమాత్రం ఆర్థిక స్థిమితం
ఉన్నది కొండంత భూరి హృదయం.

మండుతున్నా తన కాళ్ళు అమాంతం
లెక్క చేయక ఎంత మాత్రం
తీసి తన హవాయి చెప్పుల ద్వయం
తొడిగి బాలికకు తానే స్వయం
చాటింది మంచితనం, వృద్ధ ప్రాణం
చెప్పగ ఇలపై మిగిలుందని దాతృత్వం
మహిపై మరణించలేదని మానవత్వం

-జే.వి. కుమార్ చేపూరి, హైదరాబాద్

సజీవ ప్రేమతత్వం

మహోన్నతమైన మానవత్వమెకటి చెలిమితో చేదోడుగా
సజీవరూపమై నిలిచి అందించే చేయూత..

ఆ అసరాకు ఉద్వేగ భరితమై ఆనంద భాష్పాలు రాల్చే
చిరుప్రాయపు హృదయం...

లెక్కలేని ఆస్తులు ఎన్నున్నా చితికి చేరేటప్పుడు
రావులే నీ తోడుగా...

నీవు పంచే నిరుపమాన సేవాగుణం,
స్వార్థమెరుగని ప్రేమతత్వం సజీవమై నిలిచే శాశ్వతమై...

సూర్యుని వలె ఎప్పటికీ అలుపెరుగని నిస్వార్థంతో
సాగిపో అని చాటి చెప్పిన మహోన్నత మానవతరూపం...

మానవత్వపు విలువల్ని విశ్వవ్యాప్తం చేస్తు
అందరికీ ఆదర్శమై మదిన ప్రేమ మాధుర్యాన్ని
వెదజల్లలని చాటే అద్భుతమైన దృశ్య మాలిక.

-కొత్త ప్రియాంక (భానుప్రియ), హైదరాబాద్

మేధ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1080వ రోజు "నెట్టు లేనట్టయితే నెట్టుకొచ్చేదెలా?" అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. "నెట్టు లేనట్టయితే నెట్టుకొచ్చేదెలా?" అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా... **-సంపాదకులు**

మేధ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

నట్టు!

నట్టు ఊడిన నెట్టు!
ఎంత నెట్టినా కదలదది ఒట్టు
బండి కాదది మహా మొండి
అంతర్జాల మహిమ
మహా గొప్పది సుమండీ!.
నెట్టు నెట్టు లూజైతే ?
నట్టుతూ నత్త నడక
సాగించే అవకాశం లేకుంటే!?
ప్రపంచం తల కిందులు
తెల్లార్తూనే బుర్రలు
వాట్సప్ ఛాటింగ్ లతో
కాలం గడిపే జీవులు
హమ్మో! మిన్ను విరిగి మీద పడే
టైరు కారడవిలో పంక్చరైతే
ఉంది మార్గం!
మరి నెట్టు అంతర్జాలానికేది గతి?
చరవాణి మూగబోతే చిరాకు
బి.పి.తో డాక్టర్ బిల్లు పరుగు
ధాం ధూంలతో ఇంటి పైకప్పు పైపైకి
అమ్మ నాన్నల మాటలు ఈటెలు
పరీక్షల హడావిడి లో
పిల్లల బుర్రలు
తిరగలి రుబ్బుడుపొత్రాలు.
నేడు
రకరకాల యాప్స్
సైబర్ నేరాల మోసాల వలలో
ప్రపంచం వలవల విలవిల
బ్యాంకు ఖాతాలకి గండి
మనం దాచుకున్న హుండీ
హూష్ కాకి.
చైనా భారత్ లలో
ఇంటర్నెట్ వాడకం అధికం
రోజూ ఏడుగంటలు
దానికి దాసోహం
ఒకే ఒక్క గంట నెట్టు ఆగితే
డీప్ ఫేక్ సాంకేతికత దుర్వినియోగం
సకిలీలతో జీవితం కల్తీ
కొడ్తుంది బోల్తా
పడుతుంది దంతాలూడేలా
బొక్క బోర్లా!?
కంప్యూటర్ ఫోన్
ట్యాబ్ సెట్టింగ్స్ మార్చకుంటే
ఆన్లైన్ గేమ్స్ సకిలీ వెబ్సైట్
కట్టడి లేకుంటే
జనం కుదేలు
లబోదిబో అన్నా రారు
ఎవ్వరూ మనకోసం
ఇదే నాకు తెల్సిన సందేశం.
-ఎ.రాజ్యశ్రీ

కాల మహిమ

సూర్యోదయం మొదలు
మనిషి జీవితం నెట్ పైనే ఆధారము
జీవిత గమనం గమ్యం అంతా
ఏపని అయినా సరే దీనితోనే
కథ కవిత నవల వ్యాసము
ఆఫీస్ పని అన్ని కూడా నెట్
ఊపిరితో సమానంగానే నెట్
ఇవ్వాళ పని జరగలేదు అంటే
నెట్ సరిగా లేదు
బ్యాంక్ పనులు సైతం ఎన్నో
మాన్ పవర్ అయితే
కూర్చోపెట్టి కాఫీ తెప్పించి
క్షేమ సమాచారాలు అడిగి
పని చేసి మర్యాద గా పంపేవారు
ఇప్పుడు నెట్ లేదు పని ఆగింది
ఎప్పుడు రమ్మంటారు
ఏమో మాకేం తెలుసు
నెట్ పని చెయ్యడం లేదు
అంతా కాల మహిమ
అరచేతి అంతర్జాలం మహిమ.
-నారుమంచి వాణీ ప్రభాకరి

నెట్టింట్లో 'చిక్కి'న పల్లె

పల్లె..పట్నం
పిల్లలు..పెద్దలు
ఆబాలగోపాలమూ
నేడు...
నెట్టు మాయాజాలంలో
నట్టింట్లో బందీలే
పల్లెల్లో...
వీధి అరుగుల ముచ్చట్లు
ఏనాడో కనుమరుగు
ఆధునికత అందిపుచ్చుకుని
సమాచార సాంకేతిక
విప్లవపు వెల్లువలో
పల్లెఆటలు..
పల్లెపాటలు
జానపదకళలు
అన్నీ మాయమై
ఉనికి లేదు
రంగులబొమ్మల పెట్టెలు దరిజేరి
పల్లె ముచ్చటే మరచిపోయింది
పల్లెజనం
విరామం దొరికితే చాలు
నలుగురు కలసి
కష్టసుఖాలు పంచుకుంటూ
బాగోగులు తెలుసుకుంటూ
హాయిగా గడిపేటోళ్ళు
రంగులబొమ్మపెట్టె మాయలోపడి
ఆత్మీయ పలకరింపు దూరమైంది
పట్నమే కాదు
పల్లెలోనూ
ఎవరూ ఎవరినీ కలవని స్థితి
ఇరుగుపొరుగైనా
తెలియని పరిస్థితి
నేడేమో
తాకే చరవాణుల సోయగాలు
పల్లె చేతులను తాకాయి
నెట్టు అంతర్జాలం కమ్మేసింది
ఒకే ఇంట్లో
ఒకే గదిలో అందరూ ఉన్నా
ఎవరికి వారే విడివిడిగా
అందరి చేతుల్లో చరవాణులు
వీక్షణలన్నీ అందులోనే
పలకరింపులూ పరామర్శలు దానితోనే
భారత భాగవత రామాయణ
గ్రంథాలు
కథలు జానపదగాథలు
అన్నీ అటకెక్కి
చదవులసారం
నైతికవిలువల విచారణ తగ్గి
మానసిక వికాసం
కుంటుపడింది.
అంతర్జాలంలో
బందీలై
మానవీయ బంధాలు
అనుబంధాల అల్లికల బంధాలు
వీడుతున్నాయి
ఆటలు..పాటలు
నీతులు..కథలు
అన్నీ నెట్టింట్లోనే
శిశువులకు
జోలపాటలు
లాలి పాటలు
అన్నీ
అంతర్జాలపు చరవాణిలోనే
కమ్మని అమ్మపాటలు
నేడు కడుదూరం
అమ్మమ్మ
నాయినమ్మ
తాతయ్యల
కబుర్లూ కథలు
ఎక్కడికి చేరాయో.
ఆనందాలకు నెలవైన
పల్లెనైనా పట్టిపీడిస్తోంది
పాడు 'నెట్టు'
మేలు ఎంత చేస్తుందో
కీడు మించి చేస్తోంది
అవసర విజ్ఞానం
మీరితే అనర్థదాయకం.
- మధు జెల్లా

నట్లు ఊడినట్టే

నెట్ ఆగిందా
జీవన బండి నట్లు ఊడినట్టే
బండి నత్త నడకే
అంతా అయోమయం
జగన్నాథం
ఇంట్లోకి బైటకి పచార్లు
పలకరించిన వారిపై
ధుమధుమలు
పిల్లలపై వీలుంటే
దబదబలు
కరెంటు పోతే ఒకగోల
నెట్ పోతే ఇంకో గోల
కరెంట్ పోతే అరుబయట
సేద తీరతాం
తాజా గాలి
పీల్చుకుంటాం
నెట్ పోతే
రయ్యి రయ్యిన పెరుగు
చిర్రు బుర్రుల బతుకులు
నెట్ తో ముడి పడిన బతుకులు
నెట్ లేని రోజుల్లో
తీపి బతుకులు
నెట్ వలలో చిక్కి
వలలో చిక్కిన చేపల్లా
విల విల లాడుతున్నాం
నట్టింట్లో నెట్ లేకపోతె
చిందులే చిందులు
లేవగానే నెట్టింట్లో
దూరే మహానుభావు లెందరో
ప్రతి వారికి ఆత్మీయ బంధువే
బంధువుల్ని దూరం పెట్టి
ఈ బంధువు కి దగ్గరవుతున్నాం
ఈ అంతర్జాలం
మైమరిపించే మాయా జాలం
అర చేతిలో వైకుంఠం చూపించి
సరకంలోకి తోస్తుంది
సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకో
పట్టు విడుపులు
నీ స్వాధీనం చేసుకో
సాంకేతికతని తెలివిగా వాడుకో
పెరిగే నెట్ అవసరం
పెరిగే ఒంటరి తనం
తరిగే మానవ సంబంధాలు
పెరిగే మానసిక రుగ్మతలు.
-మోటూరి శాంతకుమారి

విడదీయరాని బంధం

అంతర్జాల మహిమ అంతింత కాదు
జీవితంతో పెనవేసుకొన్నదది
విడదీయరాని బంధం అయింది
ఉగ్గు తినిపిస్తే ఊడిగం చేస్తుంది
ఉద్యోగాలు కల్పించి ఊరట నిస్తుంది.
సినిమా హాళ్ళను ఇంటికి తెచ్చి
విశ్వాన్ని అరచేతిలో చూపిస్తుంది
వినోదం కల్పించి
విజ్ఞానం అందిస్తుంది
మనషులను మాటముచ్చటలకు
దూరం చేస్తుంది
అమ్మమ్మ కథలన్నీ
అటక పైకి
జోలపాటలు సైతం
జాలిగా జారుకున్నాయి
నెట్వర్క్ లేకుంటే
నానా యాగి
ప్రాణంమీదికి వచ్చినంత
పరేషాను
సెల్లులో సొల్లుకు
నెట్టు అవసరం
నెట్టు లేకుండ నెట్టుకొచ్చెదెట్లా
మనుషులను పిచ్చోల్లను చేసి
తనచుట్టే తింపుకుంటుంది
బువ్వ లేకున్నా బుద్ధిగా ఉన్నోళ్ళు
నెట్టులేకుంటే నెత్తికొట్టుకుంటున్నారు
అవసరం లేకున్నా
అవస్థలు
మరమనుషులుగా మారి
మమతల మరుపు
విజ్ఞానం పెరిగి పెరిగి
విలువలు పతనం
నెట్టుకు బానిసవు కాకు
మెదడును పాడు చేయకు.
-గుండం మోహన్ రెడ్డి

నెట్టింటి కష్టాలు నట్టింట్లో

నెట్టు లేనట్లయితే
నట్టింట్లో కష్టాలు
పోతాయి మతులు
ఉత్తుత్తి కలహాలకు శ్రీమతులు
చిర్రు బుర్రు లాడుతూ శ్రీవార్లు
గిలగిలలాడుతూ పిల్లవాళ్ళు
కారణమేమీ లేకుండా విసుక్కునే తాతగార్లు
కలిసి మెలిసి పనీ పాటలు చేసుకునే అత్తా కోడళ్ళు
కారణం లేకనే పట్టుకుంటారు జుట్లు
పక్కింటి వాళ్ల సొల్లు కబుర్లు
వస్తాయి తలనొప్పులు
పిల్లలకు ఎవరు చెప్తారు పాఠాలు?
నెట్టు లేనట్టయితే పెరుగుతాయి బంధాలు
పిల్లలకు చెప్పుకుంటారు చదువులు
కలిసిమెలిసి కబుర్లు చెప్పుకుంటూ
వంట చేసుకుంటారు అత్త కోడళ్ళు
చేస్తారు అందరూ కలిసి భోజనాలు
మనుమలకు తాతగార్లు చెప్పుకుంటారు
పద్యాలు, కథలు
పెరుగుతాయి ఆప్యాయతానురాగాలు
అందమైన చేతిరాతలు రాస్తారు కవులు
నెట్టు లేనట్టయితే ఇలా నెట్టుకొస్తారేమో?!
- మన్నెలలిత

పట్టు దొరకదు బాబు

ఆ.వె.
నెట్టులేని యెడల పట్టు దొరకదండి
భారతమ్ము చదువు భయముతొలగు
తెల్లవార్లు నిదుర కల్లయు కాదయా
రోజు పూజచేయ రోగమిదును!
తే.గీ.
పల్లెలందున మునిగెను పట్నమందు
మానసికముగ మనుషులు మంటగలువ
నెట్టు రాజ్యము నేలెను గుట్టుగాను
చదువు సంధ్యలు లేకయు చవటలయిరి!
-జక్కని గంగాధర్

కొత్త శక్తుల వేదిక

నవ్యత ఆశయించిన జనం
చిక్కుకున్నారు
శక్తుల వలయంలో
ఇదే అంతర్జాల మహిమ.
బానిస బతుకు
మరొక మారు
నవీన కార్యక్రమాలు
నవ్యతాలు కారాదు.
అందుకే అంతర్జాలంలో
ఉక్కిరి బిక్కిరి కాకూడదు
ఉపయోగాలున్నా
అవకరాలు ఎన్నెన్నో.
భయంకరమైన
అపస్వరాల
రాగాలాపన
నవ్యతతో
నవ జీవితంలో పాడుతోంది
శృతి తప్పిన గీతాన్ని.
కోడి లేక ఉదయం కాదా
అగ్గి పెట్టి లేక ఆకలి తీరదా
ముందుకాలంలో ముచ్చటగా
బతుకు నేర్వలేదా!
ఏముందీ!.
కొత్త తరం వింత
కొత్త ఆపదల పుంత
పాంటులో పగిలే
జేబులో పగిలే
శక్తి వలయాల ఉపకరాలు.
భయాన్ని, భీతిని చెంగున
ముడి వేసి
చెలగాటపు జీవితాలు
దైవాధీనాలు
బానిసత్వం కాకూడదు!!!.
-కె.కె.తాయారు

జుట్టు పీక్కునుడే?

రాతిగుహల జీవితం
నాగరికతలో నడకలు నేర్చి
పారిశ్రామికతలో పరుగుపెడితే
సాంకేతికతలతో
సాలెగూడయ్యింది.
చిప్పులతో గప్ చుప్ జీవితమే
ఆన్లైన్లలో ఆర్డర్లు వేస్తే
పసందైన కొనుగోళ్ళు
కరోనా కాలమహిమలు
క్లాసురూమును
కళ్ళముందు కట్టేసింది.
యువతల భవితలన్ని
నెట్టింట్లో లంగరేసినవి
భవిష్య పురాణాలను
భద్రపరిచి
చిలుక జోస్యాల చిత్తరువులకు
రూపం కల్పించి
రంగు రుచులను పంచుతున్నది.
అంతర్జాలంలో మంత్రమేయగలగడం
ఆధునికత సాధించిన తంత్రం
ఇంటినుండే ఇనుమడిస్తున్న
ఉత్పాదకతల ఊపు కూడా సాక్ష్యం.
చందమామ రావే అంటూ పిల్లలకు
గోరుముద్దలు తినిపించినా
బడిలో పాఠాలకు
బంగారు దారి చూపినా

అంతర్జాలం

సాగని పయనం లేదు
చేరని గమ్యం అసలే లేదు
విశ్వమంతా కుగ్రామం
అక్కడి మనుషులు ప్రత్యక్షం ఇక్కడ
ఇక్కడి మనుషులు ప్రత్యక్షం అక్కడ
ఈ వలను చేధించే విన్యాసం ఎక్కడో
అంతా గడబిడ గందరగోళం
క్షణం తీరికలేని అలసట ఎరుగనిది
సదా మన సేవలో సంక్షేమ సురక్ష
విశ్వాంతరాళం ఈ అంతర్జాలం
ఆహారమున్నా లేకున్నా
అంతర్జాలం చాలు
అడుగులు వేయకున్నా
అడ్డుకట్ట లేదు కార్యదీక్షకు
అరచేతిలో విశ్వ విహంగ వీక్షణం.
- లక్ష్మారెడ్డి పసుల

యువతకు ఉద్యోగ మార్గదర్శకమైనా
అన్నింటా ఆరితేరిన ధీశాలి.
నాణానికి రెండువైపులా
మంచితో బాటు
పెడ దారికి కూడా
ద్వారాలు తెరుచుకుని
మరకలు నిండిన మచ్చలతో
అక్కడక్కడా యువతకు నిర్వీర్యతల
నిగారింపులు కూడా.
అడుగడుగున ఆపేక్షలు కుమ్మరించినా
విజ్ఞాన విచక్షణలతో అడుగులేస్తూ
జీవరాశిలో భావరాశి నిండిన
వివేకవంతులుగా నిరూపణలకు
నిరుపమానమై మెలగాలి.
- నగునూరి రాజన్న

అలరించిన శ్రీకృష్ణరాయబారము నాటకం

శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం. శృంగేరి మఠము అలకాపురి శాఖ మరియు తెలంగాణాభాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిబ్

తెలంగాణ కుంభమేళ

దేశం లోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతర. ములుగు జిల్లా తాడ్వాయి మండలానికి చెందిన మేడారం గ్రామంలో జరిగే గిరిజన జాతర ఇది. ప్రపంచంలోనే అతిపెద్ద పండుగ ఇది తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందింది. వివిధ రాష్ట్రాల నుండి 10 కోట్లకు మందికి పైగా హాజరవుతారు .

13వ శతాబ్దంలో నేటి జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండల ప్రాంతంలోని "పొలవాస"ను పాలించే గిరిజన దొర మేడరాజు ఏకైక కుమార్తె సమ్మక్క, ఆమెను అతని మేనల్లుడైన పగిడిద్దరాజుకిచ్చి వివాహం చేస్తాడు. వీరి సంతానం సారలమ్మ, నాగులమ్మ , జంపన్న.

రాజ్యం విస్తరణకై కాకతీయ ప్రభువు మొదటి ప్రతాపరుద్రుడు "పొలవాస "పై దండిత్తుతాడు. ఆయన దాటికి తట్టుకోలేక మేడరాజు మేడారం పారిపోయి అజ్ఞాతవాసం గడుపుతుంటాడు.

మేడారాన్ని పాలించే కోయరాజు పగిడిద్దరాజు. కాకతీయ సామంతునిగా ఉంటూ కరువు కాటక పరిస్థితులలోకప్పం కట్టలేదని, మేడరాజుకు ఆశ్రయం కల్పించాడని రాజుకు వ్యతిరేకంగా మారుతున్నాడని అతన్ని అణచివేయడానికి ప్రధానమంత్రి యుగంధరునితో సహా "మాఘ శుద్ధ పౌర్ణమి" రోజున మేడారం పై దండెత్తాడు ప్రతాపరుద్రుడు.

పగిడిద్దరాజు కుటుంబమంతా కాకతీయ సైన్యంతో పోరాడారు. కానీ సుశిక్షితులైన సేన ముందు నిలవబడలేక మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ ,నాగులమ్మ, సారలమ్మ భర్త గోవిందరాజులు మరణిస్తారు.

తమ పరాజయ వార్తవిన్న జంపన్న సంపెంగ వాగులో దూకి మరణిస్తాడు. అప్పటినుండి సంపెంగ వాగు "జంపన్న" వాగుగా చలామణి అవుతున్నది. సమ్మక్క యుద్ధభూమిలో సైన్యాన్ని ముప్పు తిప్పలు పెట్టినా , శత్రువులు చేతిలో దెబ్బతిన్న సమ్మక్క రక్తపు ధారలతో చిలకలగుట్టవైపు వెళ్లి అదృశ్యమైంది. ఆమెజాడ కనిపించలేదు. కానీ ఆ ప్రాంతంలో ఒక పుట్ట దగ్గర పసుపు,కుంకుమలున్న కుంకుమ భరణి లభించడంతో ఆ భరణిని సమ్మక్కగా భావించారు గిరిజనులు. ప్రతి రెండు సంవత్సరాలకొకసారి 'మాఘ శుద్ధ పౌర్ణమి' రోజున కోయ జాతి వాళ్ళందరూ సమ్మక్క జాతరను జరుపుకుంటారు.

జాతర మొదటి రోజు సారలమ్మను " కన్నెపల్లి" నుండి తీసుకొని వచ్చి గద్దెపై ఉంచుతారు. రెండవ రోజున చిలకలగుట్ట నుండి కుంకుమ భరణి రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తీసుకు వస్తారు.అంతకు ముందు రోజుల్లో పగిడిద్ద రాజును, గోవిందరాజులునీ గిరిజన వంశస్థులు మేళతాళాలతో మేడారం తీసుకొస్తారు. వీరందరిని ఎవరి గద్దెపై వారిని ప్రతిష్ట చేస్తారు . దేవతలను గద్దపై ప్రతిష్ఠించే సమయంలో శివసత్తులు పునకాలు చేస్తారు. మూడు రోజులు మాత్రమే అమ్మవారిని గద్దెలపై ఉంచి నాలుగో రోజు ఎదా స్థానానికి చేరుస్తారు .అమ్మవార్లకు(బెల్లం)బంగారాన్ని నైవేద్యంగా పెడతారు. కులం మతం అని లేకుండా అందరూ ఉత్సవాలలో పాల్గొంటారు. అమ్మవార్లకు చీరలు,ఒడి బియ్యం పోస్తారు. ఇతరుల పెట్టిన బంగారాన్ని భక్తిగా తెచ్చుకుంటారు. ఎదురుకోళ్ళను అమ్మవారికి విడిచిపెడతారు .తలనీలాలు సమర్పిస్తారు.

విగ్రహం లేని జాతర. నమ్మకమేనడిపించే జనజాతర.

దాదాపు 900 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ జాతరను 1940 వ సంవత్సరం వరకు గిరిజనులు మాత్రమే జరుపుకునే వారు. తర్వాత ప్రజలెక్కువై కొండ కింద గిరిజన సంప్రదాయంలోనే జాతరను జరుపుతారు .తెలంగాణ ,మధ్యప్రదేశ్ మహారాష్ట్ర ఒడిస్సా మొదలు రాష్ట్రాల నుండి భక్తులు వస్తూ ఉంటారు.

మా చిన్నప్పుడు పెద్ద అడవిలో ఉండేది మేడారం. మాచిన్నప్పుడు బండ్లు కట్టుకొని ఒక మూడు నాలుగు కుటుంబాల వాళ్ళందరం కలిసి వెళ్లే వాళ్ళం .చీకటైతే ఏదో ఒక ఊర్లో వండుకొని తిని మళ్ళీ ప్రయాణం చేసే వాళ్ళం.

ఇప్పుడు అన్ని రకాల వసతులు కల్పించింది పాతని వప్రభుత్వం. అతని మరువని వారు సంతోషంగా గడిపేవారు ఇప్పటికి కూడా మూడు రోజులు అక్కడే గడిపే వాళ్ళు ఉన్నారు.ఇప్పుడు మెరుగైన వసతులతో బస్సు సౌకర్యాలు ఉన్నవి.

మేడారం జాతరలో అమ్మవార్లను గద్దెపై మూడురోజులుంచి తర్వాత యధాస్థానానికి తీసుకువెళ్తారు.

అమ్మవార్లు వెళ్ళిన తరువాతఅక్కడ వర్షం పడుతుంది.నాకు తెలిసి ఇప్పటికీ వర్షం పడుతుంది.అలా వర్షంలో వ్యర్థాలన్ని కొట్టుకుపోతాయని ప్రజల నమ్మకం. సత్యం గల తల్లి సమ్మక్క దేవుడు అంటారు అందరూ.

-డా. బండారి సుజాత
9959771228

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణను తప్పనిసరి చేయలేమా !

స్కౌటింగ్ ఆలోచనలకు తుది రూపం ఇచ్చి వ్యవస్థాపకులుగా చరిత్ర లో నిలిచిన "రాబర్ట్ బాడెన్ పోవెల్"తో పాటు వారి సతీమణి "ఓలావె బాడెన్ పోవెల్" జన్మదినం 22 ఫిబ్రవరి (1857)ను పురస్కరిం చుకొని సంద ర్భాన్ని పురస్కరించుకొని ప్రపంచ వ్యాప్తంగా 22 ఫిబ్రవరిన విశ్వ స్కౌటింగ్ అసోసియేషన్లు 'ప్రపంచ స్కౌట్స్ దినోత్సవం' ఘనంగా నిర్వహి స్తాయి. భారతదేశంలో కూడా భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలు 22 ఫిబ్రవరిన స్కౌట్స్ దినోత్సవాలను విద్యాలయాల్లో ఘనమైన వేడుకలుగా నిర్వహిస్తారు. పాఠశాల/కళాశాల బాలబాలికల్లో శారీరక దృఢత్వం, మానసిక పరిపక్వత, ఆధ్యాత్మిక అభివృద్ధిని ఆశించి బాలలకు సైనిక తరహా క్షేత్ర స్థాయి నిర్మాణాత్మక శిక్షణను స్కౌట్స్ అండ్ గైడ్స్ పేరుతో అందిస్తారు. ప్రపంచ స్కౌట్స్ దినం వేదికగా బాలలు, శిక్షణ అందించే అధికారులు పాల్గొని స్కౌట్ ఉద్యమా నికి పునరం కితం అవుతామని ప్రతిజ్ఞ చేస్తారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ద్వారా పాఠశాల బాలబాలికల్లో పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి, జీవితంలో ఎదురయ్యే ప్రతికూలతలను తట్టుకొని ముందుకు సాగడానికి, చిన్నారులలో దేశభక్తి నూరి పోయడానికి దోహదపడే పలు రకాల శిక్షణ కార్యక్రమాలను నిర్వహి స్తారు.

వరల్డ్ థింకింగ్ డే:

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ సేవలను గుర్తిస్తూ, ప్రస్తుతిస్తూ 'పీస్ మెసెంజర్ (శాంతి సందేశకులు)'గా ఐక్యరాజ్యసమితి గుర్తించడం హర్షదాయకం. ఇదే రోజున "వరల్డ్ థింకింగ్ డే"ను కూడా జరుపుకోవడం విశేషం. బ్రిటీష్ ఆర్మీ అధికారి అయిన స్కౌట్స్ వ్యవస్థాపకుడైన రాబర్ట్ బాడెన్ పోవెల్ 1899 - 1902 మధ్య కాలంలో 217- రోజుల పాటు సౌత్ ఆఫ్రికాలో 'డిఫెన్స్ ఆఫ్ మేఫెకింగ్' అనబడే మహాకార్యం చేసి జాతి హీరోగా పేరు తెచ్చుకున్నారు. 1908లో 'బాయ్ స్కౌట్స్'ను తొలిసారిగా ఏర్పాటు చేసి, తన సతీమణితో కలిసి 1910లో 'గర్ల్స్ స్కౌట్ అండ్ గైడ్స్' సంస్థను స్థాపిం చడంలో రాబర్ట్ బాడెన్ పోవెల్ సఫలీ కృతం కావడంతో మరో సారి ప్రపంచ మానవాళి దృష్టిని ఆకర్షించారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ (బియస్‌జి):

భారత ప్రభుత్వం చొరవతో హెచ్. యన్. కుంజ్రూ కమిటీ సిఫార్సుతో 07 నవంబర్ 1950న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, బియస్‌జి ప్రారంభమైంది. 1951 ఆగష్టు 15న ఆల్ ఇండియా గర్ల్స్ గైడ్స్ సంస్థలు ఏర్పడిన ప్రస్తుతం పూర్తి స్థాయి భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో 57 లక్షల పిల్లలు (37 లక్షల స్కౌట్స్, 20 లక్షల గైడ్స్) శిక్షణ పొందుతున్నారని, 2024 నాటికి ఒక కోటి మంది యువతకు అవకాశం కల్పించేలా ప్రణాళికలు వేశారు.

తొలిసారి ఇండియాలో 1909లో స్కౌట్స్, 1911లో గైడ్స్ ప్రారంభమైంది. 1938లో 'వరల్డ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ది స్కౌట్స్ మూవ్‌మెంట్'లో సభ్యత్వం పొందిన భారత్, 1950 నుంచి తనదైన తరహాలో బియస్‌జిని ఉద్యమంగా చేపట్టింది. భారత్ స్కౌట్స్‌లో 3-5 ఏండ్ల పిల్లల్ని 'బన్నీస్'గా, 5-10 ఏండ్ల లోపు బాలలను 'కబ్స్'గా, 10-17 ఏండ్ల కౌమార బాలలను 'స్కౌట్స్'గా, 17-25 ఏండ్ల విద్యార్థుల ను 'రోవర్స్'గా పిలుస్తూ శిక్షణలను అందిస్తారు. భారత్ గైడ్స్‌లో 5-10 ఏండ్ల బాలికలను 'బుల్‌బుల్స్'గా, 10-17 ఏండ్ల బాలికలను 'గైడ్స్'గా, 17-25 ఏండ్ల యువతులను 'రేంజర్స్'గా పిలుస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో 18,510 మంది స్కౌట్స్, 15,150 మంది గైడ్స్ శిక్షణ పొందుతుండగా, తెలంగాణలో 9, 145 మంది స్కౌట్స్, 6,489 మంది గైడ్స్ శిక్షణ పొందుతున్నారు.స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఫలితంగా రేపటి పౌరసమాజాన్ని నైపుణ్యం కలిగిన, సత్కార్యాల సాధన, మానవీయ విలువలను నేర్పించడం లాంటి బృహత్ కార్యక్రమాలను సుసాధ్యం చేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం లేత మనసులను బాధ్యతగల రేపటి పౌరులుగా తీర్చిదిద్దడంలో సఫలం కావాలని ఆశిద్దాం. క్షేత్ర స్థాయిలో పని చేసిన అనుభవంతో నేర్చుకోవడం, గ్రూపులుగా సమన్వ యంతో లక్ష్యాలను చేరుకోవడం, స్కౌట్స్ అధికార యంత్రాంగ సూచనలు తీసుకోవడం లాంటి అంశాలను చేరుకోవడంలో బియస్‌జి సఫలం కావాలని, 116వ వరల్డ్ స్కౌట్ డే శుభసందర్భంగా భారత స్కౌట్స్ అండ్ గౌడ్స్ బాధ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేద్దాం.

(22 ఫిబ్రవరి ప్రపంచ స్కౌట్స్ దినోత్సవం సందర్భంగా)

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

షట్పదులు

అధికారం-అహంకరిస్తే
మిగిలేది అధఃపాతాళమే!
దౌర్జన్యం మితిమీరితే
గద్దెలైనా గందరగోళమే!
అవినీతులు అనంతమైతే
ఇ.డి.తో ఇండ్లకు తాళమే!

నేతగా విర్రవీగి పోయావో
వాతగా నేలకొరిగి పోవుటే!
గెలుపు ధీమాతో అహంకరించావో
ఓటువేటుతో ఓడిపోవుటే!
దుర్యోధనాదుల దుశ్చర్యలతో
దురుసుగా మెదలితే దుఃఖించుటే!

- డా॥వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

ఈనెల 18న హైదరాబాద్ నల్లకుంట సాకేత్ అపార్ట్‌మెంట్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో షణ్ముఖశ్రీ రచించిన 'కవితలు-కథలు-కథనాలు' పుస్తకాన్ని ఆంధ్రభూమి పూర్వ సంపాదకులు ఎం.వి.ఆర్.శాస్త్రి ఆవిష్కరించగా ఆంధ్రప్రభ సంపాదకులు వై.యస్.ఆర్.శర్మ సభకు అధ్యక్షత వహించారు. చిత్రంలో సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, రచయిత రామకృష్ణ చంద్రమౌళి.

రచయిత ఆర్సీ కృష్ణస్వామి రాజు రచించిన మేకలబండ నవల ఈనెల 18న తిరుపతి రచయితల సంఘం ఆధ్వర్యంలో తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరింపబడింది. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ డాక్టర్ మన్నవ గంగాధర్ ప్రసాద్, తిరుపతి వెటర్నరీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆర్. వి.సురేష్ కుమార్, శ్వేత డైరెక్టర్ భూమన్, ఎస్వీ యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతి ఆర్. రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆహ్వానము

జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

సవరత్న మహిళా పురస్కారాల ప్రదానోత్సవం

ముఖ్య అతిథి :
శ్రీ పి. విజయబాబు
అధ్యక్షులు,
ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం,
ఆంధ్ర ప్రదేశ్ భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ.

సభాధ్యక్షులు
లయన్ డా॥ చిల్లా రాజశేఖర్ రెడ్డి
పారిశ్రామికవేత్త

సభాప్రారంభం
శ్రీ జమలాపురం రాధాకృష్ణ
లఘుచిత్ర నిర్మాత

సంగీత కళాకారుల సత్కారం
డా॥ టి. విజయభాస్కరరెడ్డి
న్యాయవాది, ప్రొఫెసర్ (న్యాయశాస్త్రం)

పురస్కార స్వీకర్తల స్వాగత సత్కారం
శ్రీమతి రామరాజు లక్ష్మీశ్రీనివాస్
డా॥ సి. నారాయణరెడ్డి
స్వర్ణకంకణ స్వీకర్త, ప్రముఖ వీణా విద్వాంసురాలు, గుంటూరు

అతిథుల సత్కారం
డా॥ లయన్ ఎస్. రామచంద్ర రావు
చైర్మన్, ఎస్. ఆర్. ఆర్. చారిటబుల్ ఫౌండేషన్

గౌరవ అతిథి
డా॥ ఎల్. జయంతిరెడ్డి
ఛైర్మన్, జె.జె. హాస్పిటల్

జ్యోతి ప్రకాశనం
శ్రీమతి కె. విజయలక్ష్మి
పారిశ్రామికవేత్త

ఆత్మీయ అతిథి
డా॥ కె. వీరభోగ వసంతరాయులు
కళాపోషకులు

తేది : 11-03-2024, సోమవారం, సా॥ 5.30 గం॥లకు
శ్రీత్యాగరాయ గానసభ (ప్రధానమందిరం), చిక్కడపల్లి, హైదరాబాద్.

గుడిబండి వెంకటరెడ్డి
చైర్మన్ - 9849882783

లయన్ వి.వి.రాఘవ రెడ్డి
ప్రధాన కార్యదర్శి - 9866332738

సమ్మక్క-సారలమ్మ వనదేవతలు!

తెంగాణ లో
చారిత్రాత్మకమైన ఆవిష్కృత ఘట్టం,
ఆదివాసుల నిండైన జన జాతర,
మూలవాసుల ముచ్చటైన జాతర!
కోయ వనదేవతల మహా కుంభమేళ ,
మాఘ పున్నమి నాడు ఈడేరే
నాలుగు రోజుల
దండైన సమ్మక్క-సారలమ్మల
సత్యమైన జాతరా!
ఎర్రమల్లెల జాతరా! ఆసియా ఖండం
లోనే ఎదురు లేని జాతర!
అచ్చంగా స్వచ్ఛమైన జాతర!
ఒరుగల్లు తల్లులు భద్రకాళి,
కాకతి దేవతల
ప్రతిస్వరూపాలే ఈ దయగల తల్లులు,
కిలోమీటర్ల పొడగునా సాగే ఎడ్లబండ్లు,
ఎదురు కోళ్లను ఎగురేయడం,
అమ్మవార్లను గద్దెలపై స్వాగతించడం,
జంపన్న వాగులో తడిబట్టలతో
సరిగంగ స్నానాలు, బండారు,
శివశక్తుల పూనకాలు,
నిలువెత్తు బంగారం!
కల్లు-సారల సమర్పణం!
వేడుక గా అమ్మవార్ల దర్శనాలు!
విగ్రహారాధనలు లేని తల్లుల నెలవు!
కోయ పూజారులే కొలిచే వనదేవతలు,
గోపురాలు, గర్భగుడులు, నివేదనలు,
ధ్వజ స్తంభాలు, తలుపులు,
తాళాలు లేని జాతరా!
తెలంగాణా కోయ శక్తిమాతల
అపూర్వఆరాధనల ట్రేడ్ మార్క్!.

పులులు, సింహాలు తిరిగే ఏటూరు నాగారం
దట్టమైన పచ్చటి అడవులు , అభయారణ్యాలు,
పసుపు మయమై జనసంద్రమై అలరారు,
ములుగు జిల్లా గిరిజన ఖిల్లా,
ద్వైవార్షికంగా జరిగే ముచ్చటైన
మేడారం జాతర విశ్వప్రసిద్ధి!.
ఆత్మగౌరవానికి, ధిక్కార స్వరావికి ప్రతీకలు
కాకతీయ రాజుల అహంకారంపై
ఈ వీరమాతల సమరభేరి అద్వితీయం,!
సంపెంగ వాగు జంపన్న వాగుగా
మారిన ఘన సందర్భం!
పొలవాస రాజు మేడరాజు
ముద్దుల తనయ,
పడిగిద్దరాజు
అర్ధాంగి వీరనారి సమ్మక్క,
చిలుకల గుట్ట సాక్షిగా
పసుపు కుంకుమ భరిణిలై
ఇలపై వెలసిన వీరమాత,
సారలమ్మ,- గోవిందరాజు,,నాగులమ్మ,
జంపన్నల రక్తతర్పణాల తో సాగే ఈ జాతర!ఉప
జాతరలతో దద్దరిల్లే కొలువుల జాతరలు,
కోటికి పైగా కొలిచె !
అమ్మవార్ల చారిత్రాత్మక జాతర! తెలంగాణ ఇల
చారిత్రాత్మకం, వనదేవతలు
ప్రకృతి ఆరాధనలే!
జయహో జయ జయహో!

-సంకేపల్లి నాగేంద్రశర్మ,
80748 26371.

మహాజాతర మేడారం

వనదేవతల సాక్షాత్కారం
సమ్మక్క సారలమ్మ దైవ దర్శనం
భక్తుల జన సందోహం
పుడమితల్లి ఆనంద విహారం..!

గుడి గోపురం లేని
అర్చన అభిషేకం లేని
మడి దూపం లేని
పసుపు కుంకుమ భరణి తేజం..!

తలనీలాలు మునకలు
జంపన్నవాగు తలస్నానాలు
నిలువెత్తు బంగారు బెల్లాలు
జమిడిక దప్పు మోతలు..!

సిగుమూగు డోలి రాగాలు
ఆదివాసీ సంబురాలు
అనంత కోటి శక్తిప్రసాదాలు
గిరిజన మేడారం జాతరలు..!

ధిక్కార శౌర్య ఖడ్గతేజం
వీర వనితల చిత్రిక పర్వం
బహుభళ రణక్షేత్ర ప్రతీకం
పౌరుషాల మేడారం పునీతం..!

ఎందరో త్యాగాల వనమాలికం
పడిగిరాజు గోవిందరాజుల
గద్దెల తలమానికం
పశువశాన పవిత్ర ధామం..!

కన్నెపల్లి నుండి దేవతల రాక
బంగారంతో తులాభారాల కేక
ఆనంద డోలికల్లో భక్తుల మునక
సమ్మక్క సారలమ్మ విజయ ప్రతీక..!

వమ్ముకాని నమ్మకాల భక్తి పర్వం
కోటానుకోట్ల జన హృదయాల
కోరికలకు ముక్తి ప్రసాదం
జగన్మాతలే నిలువెత్తు సాక్షాత్తుకారం..!

గిరిజనపుత్రుల వేడుక ఆసాంతం
అడవి తల్లుల వేడుకల ఆనందం
మూలవాసుల రక్తి పర్వం
జన సంద్రంగా మేడారం
భారత దేశానికే దివ్య
మహిమగల దేవతల మణిహారం..!

ఆసియాలోనే అతిపెద్ద జాతరై
తెలంగాణ పండుగగా వాసికెక్కి
మండ మిలిగే పండుగతో మొదలై
కాక, సిద్ద వంశం సంప్రదాయల మధ్య
చెలపెయ్య బలులూ కోయ వాయిద్యాలతో
శివ సత్తుల కోలాహలంతో
సమ్మక్క సారలమ్మ ఆగమనంతో
మేడారం
ఆధ్యాత్మిక భక్తిభావంగా కీర్తింపబడెను

-డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఆరు గ్యారేజ్ లలో చేరాయి -కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 21:కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలు ఆరు గ్యారేజీలుగా మారాయని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా మహబూబ్‌నగర్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ. ఆరు గ్యారెంటీల అమలుకు నిధులు ఎలా సమకూరుస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హామీల అమలు కోసం నిధులు సమకూర్చడంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రణాళిక లేదన్నారు. ఆరు గ్యారెంటీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలన్నారు. కర్ణాటకలో కరెంటు సమస్యతో రైతులు రోడ్డున పడ్డారన్నారు. కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా తెలంగాణ ప్రజల జీవితాలు బాగుపడతాయనుకోవడం సరికాదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని మండిపడ్డారు.

మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఓవైసీ ,కేసీఆర్, రాహుల్ గాంధీ ఎంతమంది దిగొచ్చిన మోదీని అడ్డుకోలేరన్నారు. బీజేపీకి ఈ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని మరోసారి స్పష్టం చేశారు.

'రాష్ట్రంలో బీఆర్ఎస్, కేసీఆర్ ఆవశ్యకత లేదు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్ఎస్‌కు ఎజెండా లేదు. ఆ పార్టీ పదేళ్ల పాలనలో చేసిందేమీ లేదు. అధికార దుర్వినియోగం, అహంకారం, అవినీతి వల్లే ప్రజలు తిరస్కరించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రధాని అభ్యర్థి ఎవరో ఇప్పటికీ తెలియదు. దేశంలో కేవలం మూడు రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆ మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీదే విజయం. దేశంలో తొమ్మిదిన్నరేళ్లుగా ఎలాంటి అవినీతి లేకుండా మోదీ పాలన సాగిస్తున్నారు. బీజేపీ విజయసంకల్పయాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

వోకల్ ఫర్ లోకల్ నినాదంతో చేనేత ఉత్పత్తులకు ప్రచారం

వోకల్ ఫర్ లోకల్ నినాదంతో చేనేత ఉత్పత్తులకు ప్రచారం కల్పిస్తున్న మోదీ ప్రభుత్వం నేతన్నలకు అండగా ఉండడమే కాక ప్రధానమంత్రి మోదీ స్వయంగా వారంలో ఒకరోజు తప్పకుండా చేనేత వస్త్రాలు ధరిస్తారని పేర్కొన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా నేడు నారాయణ పేటలో నేతన్నలను కలిసి ఆయన మాట్లాడారు.. నారాయణ పేటలో చీరలు నేస్తున్న నేతన్నలతో పాటుగా కాసేపు మగ్గం నేసి, అక్కడి నేతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, నేతన్నలను ఆదుకునేందుకు మోదీ పలు పథకాలను ప్రవేపపెట్టారని,వాటిని వినియోగించుకోవాలని కోరారు.

మేడారం జాతర-శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మంత్రి

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ, తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన 'సమ్మక్క సారక్క మేడారం జాతర' ప్రారంభం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. ఈ జాతర భారతీయ సంస్కృతి, విలువలు, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని అభివర్ణించారు. సమ్మక్క సారక్కల జీవితాలు, స్ఫూర్తిదాయకం, అన్యాయాలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా వారు సాగించిన పోరాటం నేటికీ ఆదర్శంగా నిలుస్తుంది అని శుభాకాంక్షల సందేశంలో పేర్కొన్నారు.

మీరు నాకు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ అదే.. కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో హరీశ్ రావు

సిద్దిపేట, ఫిబ్రవరి 21: రూ.50లక్షల సీఎస్ఆర్ నిధులతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసుకున్నాం. రాబోయే కాలం మొత్తం కంప్యూటర్ యుగమే కావున విద్యార్థులు వీటిని వినియోగించుకోవాలని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. జిలా కేంద్రంలోని గర్ల్స్ హై స్కూల్‌లో బుధవారం కంప్యూటర్ ల్యాబ్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠశాల దినదిన అభివృద్ధి జరుగుతుం దన్నారు.

గతంలో వర్షం వస్తే పెచ్చులు ఉడుతాయని భయంతో ఈ బడిని బంద్ చేసేవారు. కానీ, నేడు కార్పొరేట్ స్కూల్‌ని తలదన్నేలా ఉందన్నారున. త్వరలోనే ఈ పాఠశాలకు ఇన్‌స్ట్రక్టర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం జీవన విధానంలో భాగమైందని చెప్పారు.

జిల్లాలో ఎక్కువ మంది ఆడపిల్లలు చదివే పాఠశాల ఇది . ఈసారి పదో తరగతిలో వందశాతం పలితాలు సాధించాలన్నారు. మీరు నాకు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ పదికి పది మార్కులు సాధించడమేనని చెప్పారు. అలాగే నీటిని వృథా చేయవద్దు, అవసరం మేరకే వాడుకోవాలని సూచించారు.

ఆహ్వానం
కొలకలూరి పురస్కారాల ప్రదానోత్సవం
తేది : 26.02.2024 సాయంత్రం 6.00 నుండి 8.00 గంటల వరకు
ఎన్.టి.ఆర్ కళాప్రాంగణం
పొ.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాదు.

ముఖ్య అతిథి :
గౌరవనీయులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క
ఉప ముఖ్యమంత్రి, తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్.

విశిష్ట అతిథి : ఆచార్య టి. కిషన్ రావు
ఉపాధ్యక్షులు, పొ. శ్రీ తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్.

అధ్యక్షత : ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
ఉపాధ్యక్షులు, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

గౌరవ అతిథి : ఆచార్య చిలుమూరి శ్రీనివాస రావు
ప్రిన్సిపాల్, వి.యస్. యూనివర్సిటీ కళాశాల, కావలి.

ప్రత్యేక అతిథి : ఆచార్య కొలకలూరి సుమకిరణ్
ఆంగ్లశాఖాధ్యక్షులు, మెంబరు-ఇ.సి., యస్వీ యూనివర్సిటీ, తిరుపతి.

కొలకలూరి భాగీరథీ కథానిక పురస్కారం
1. "కామునికంత"
రచయిత : శ్రీ హుమాయున్ సంఘీర్
2. "కలుంకూరి గుట్ట"
రచయిత : శ్రీ కె.వి. మేఘనాథ రెడ్డి

కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం
1. "అడవి బతుకులు"
రచయిత : డా. దిలావర్
2. "నిర్మాల్యం"
రచయిత : శ్రీ సింహప్రసాద్

కొలకలూరి రామయ్య విమర్శన పురస్కారం
1. "తాత్త్వికనేపథ్యంలో తెలుగు కవిత్వపరిణామం"
రచయిత : డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి
2. "నవలా హృదయం"
రచయిత : శ్రీ వి.రాజా రామమోహన రావు

సన్మానం
టి.విటి: "ఆచార్య కొలకలూరి జాషా పామాత్మం : పామాజిక విశ్లేషణ"
పరిశోధకురాలు : డా. గర్లం తిరుపతమ్మ
పర్యవేక్షణ : ఆచార్య సింగుపురం నారాయణ రావు
బెర్హంపుర విశ్వవిద్యాలయం, బెర్హంపుర, ఒరిస్సా
పిహెచ్.టి : "ఆచార్య కొలకలూరి నవలా సాహిత్యం : సామాజిక దృక్పథం"
పరిశోధకురాలు : డా. దుగులూరి సురేఖ
పర్యవేక్షణ : డా. వై. సుహాషిణి, తెలుగు శాఖ
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి

విందు :గ్రాండ్ ప్లాజా
పొ.శ్రీ.తె.వి.వి. ఎదుట, హౌజ్ హౌస్ పక్కన,
పిల్లర్ నెంబరు ఎ1235క,

తమ ఆగమనాభిలాషులు :
ఆహ్వానకులు : కె. ఆశాజ్యోతి జనార్దనం
శ్రీమతి & శ్రీ కె. అనిత శ్రీకిరణ్
సెల్ నెం. 9393099035

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

'బుధవారం బాద్షా'

(ప్రథమ)

ప్రేమబంధం

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

తుషార బిందువులు నా మేనును
చలచల్లగా తాకుతుంటే
మబ్బు కన్యలను చీల్చుకుంటూ
భానుడు త్వర త్వరగా
ఉదయించే ఉషోదయం
గువ్వలు బారులు బారులుగా
వెళుతున్న సుందర దృశ్యం.
ఓ ప్రియా! నీవు ఒక్కసారిగా
తలపుకు వచ్